రూపాయల బహుమానములు

Saraswata Niketanam
VETAPALEM

# ఆనందబోధిని

సంపుటము ౮.] సెప్టెంబరు [సంచిక ౪.

అవ్వా కావాలి బువ్వా కావాలి




జమీందారు:--నేను సాధారణ నియోజకవర్గములకు పోటీచేసి శాసనసభలలో కూచుంటే అది నాయొక్క బలము, చాకచక్యము. సాధారణసభ్యత్వములకు పోటీచేయుటకు హక్కులు, ప్రత్యేక నియోజకవర్గములు కూడా మాకు కావాలి.

రైతు:---అయ్యా బాబో! అవ్వాకావాలి బువ్వాకావాలంటూ రెండూ చేతబుచ్చుకుని ఆకలిస్తానంటాడు! ఇక నాకు ప్రాతినిధ్యమేది, పలుకుబడియేది? [జమీందారులు తమకు ప్రత్యేక నియోజకవర్గము లుండవలెననియు రెండవ చేంబరు కావలెననియు అట్టహాసము చేయుచున్నారు.]

సం॥కి చందా ఒక రూపాయి.
విడిసంచిక అణాన్నర,

“ఆనందబోధిని” కార్యాలయము
సౌకారుపేట / మదరాసు.

టెలిగ్రాఫ్ ఎడ్రెస్, 'ఆనందబోధిని' **ఆనందబోధిని** టెలిఫోను నెం. 3005.

సచిత్రమాసపత్రిక

ప్రతిమాసారంభమునను వెలువడును.

సంవత్సర చందా ఒకరూపాయి. విడిసంచిక అణాన్నర

---

వ్యాసముల నంపువారు సంపాదకునిపేర పంపవలెను. పత్రికలో ప్రకటనలు చేయువారు వివరములకై మేనేజరుపేర పంపవలెను. ప్రకటితము కాని వ్యాసములు వలయువారు తిరుగుతపాలుచార్జీ పంపవలెను. సంవత్సరచందాధనము ముందుగ పంపబడవలెను. సంచిక అందనిచో 10-వ తేది లోపుగ ఆవిషయమును కార్యాలయమునకు తెలుపవలెను. ఇతరవివరములు కోరువారు కార్యాలయమునకు వ్రాయుడు.

ఆనందబోధిని కార్యాలయం,

సావుకారుపేట, మదరాసు.

---

## మీరు బొమ్మలు వ్రాయగలరా?

బాలచిత్రకారులకు ప్రోత్సాహము.



మేము బొమ్మలనంపిన వేస్తారా అని అనేకమంది వ్రాస్తున్నారు. బాల చిత్రకారులకు ప్రోత్సాహం ఇయ్యడానికి నిశ్చయించాం. హాస్యరసమైన విషయం ఇండియన్ ఇంకితో బొమ్మలు వ్రాసిపంపిన వాటిని బ్లాకుచేయించి పత్రికలో చిత్రకారుని పేరుతో ప్రకటించెదము. ప్రతిచిత్రంతో అందుకు సంబంధించిన హాస్యవిషయం వెనుక పెన్సిలుతో వ్రాయండి. ఇది కళాప్రోత్సాహమునకు చేసిన యేర్పాటు. మీచిత్రములుపడిన పత్రిక మీకు వస్తుంది. మీచిత్రములను వెంటనే పంపండి.

ఇట్లు,

సంపాదకుడు.

ఆనందబోధిని.

# ఆనందబోధిని

సర్వవిషయముల చర్చజేయు మాసపత్రిక

| సంపుటము ౪ | ౧౯౩౩-వ సం॥ సెప్టెంబరు ౧-వ తేది, మదరాసు. | సంచిక ౪ |
| --- | --- | --- |
| Vol. 4. | Madras—1st September 1933. | No 4. |


## రైతు జమీందారు 'లడాయ్'


రైతు కష్టాల్లో పడ్డాడు. ఇంక జమీందారీరైతు కష్టాల సంగతిగురించి చెప్పడానికి వీలులేకుండానే వుంది. జమీందారీరైతుల యిబ్బందులకు ఒక అంతములేదు. రైతులపట్ల జమీందారుల వర్తనానికి ఒక అర్థము లేదు. దేశమును ఆర్థిక దురవస్థ పట్టుకొని పీల్చి పిప్పిచేస్తున్నది. యింకో ప్రక్క ధరలు పడిపోయాయి. మరో ప్రక్క నిరుద్యోగ సమస్య పెచ్చుపెరిగి పోయినది. వేరొక ప్రక్క విపరీతపు జనసంఖ్య. క్రొత్త క్రొత్త జాడ్యములు, భయంకర ఆకారములతో మీదపడి పీకుకొని తింటున్నవి. దేశముయొక్క మొత్తపు స్థితి ఈవిధమున నుండగా రైతు స్థితి-అందులను జమీందారీ రైతులస్థితి మరింత భీభత్సముగా నున్నది. జమీందారీ రైతులు తమ కడగండ్లను జమీందారులతో చెప్పుకొని రక్షింపుడని ప్రార్థించినను జమీందారులు లెక్కచేయ లేదు. అందుమీద శాంతవర్తనుడగు రైతు తనవల్లనైనంతవరకు పన్నులు తలవైనను తాకట్టువెట్టి కడుతూ వచ్చాడు

ప్రస్తుతము ఆస్థితికూడ దాటిపోయినది. ఇంక చేయుటకు యేమియును తోచదాయెను. జమీందారీ రైతులందరును సంఘములుగ నేర్పడి కొందరు నాయకుల సహాయమున సక్రమాందోళనమును గావింప పూనుకొన్నారు. జమీందారీ రైతు నాయకులు రాయబారములను సాగించుటకేనియు అవకాశములను కల్పింపరైరి. కడకు శాసనసభ మూలమున కొంతభారమును తగ్గించుకొనగ జూచారు. సామి వెంకటాచలము శెట్టిగారు 'ఎస్టేటుల్యాండు ఆక్టు' సవరణను ప్రతిపాదించిరి. ఆ స్పర్ధయేని రాకుండ జేయవలయునని జమీందారగు ప్రధానమంత్రి ప్రయత్నించెను. అందులకు

తోడుగ కొందరు యితర శాసనసభ్యులు జమీందారుల పక్షము వహించి తాళము వేయుటెంతయు నింద్యము. ప్రజలయొక్క హితమును కోరుచు తమకు అనుకూల వర్తనమును ప్రదర్శించెదరను నమ్మకముతో ప్రజలు శాసనసభల కంపిన శాసన సభ్యులు ప్రజలకే విరుద్ధముగ వర్తించుటకన్న ద్రోహము యింకొకటిలేదు. మొన్న ఏలూరులో సమావేశమైన జమీందారీ రైతుల సభలో కావింపబడిన తీర్మానములు చాలా సమంజసముగా నున్నవి. జమీందారీరైతులు హిరణ్యాక్షవరములను కోరలేదు. బ్రిటిషు ఇండియాలోనగల రైతులకుగల రీతినే పన్నులు, పుల్లరి వగైరా విషయము లుండిన సంతృప్తి నందెద మనుచున్నారు. న్యాయసమ్మతమగు రైతుల యొక్క యిట్టి కోరికలను జమీందారులు తగినసమయమున అంగీకరించుచో యెంతయు బాగుగనుండును. అట్లుకాక వీరిమాట మనమేల వినవలెను అను గర్వమునకులోనయి యూరకుండిన తమంతతామె కష్టములను తెచ్చుకొనిన వారయ్యెదరు.

---

# బహుమతి పొందినవారు




## క్రిందటి బహుమానపు పోటీ

ఒక్కరుకూడ మాకవరులో నున్నట్లు వ్రాయ లేదు. కవరులో నున్న వరుస; (1) గులాబి. (2) గోహారు. (3) గోదావరి. (4) విశాఖపట్ణం. (5) మామిడి.

ఈ విధముగ వ్రాయకుండ ఏదియో నొక తప్పుతో యీ క్రిందివారు వ్రాసియున్నారు:—వారి కందఱికి బహుమానపు మొత్తము రు 5/—లున్నూ. ఒక్కొక్కరికి రు 1-4-0 వంతున పంచిపెట్టబడినది.

1. నాద్రేవు రమేశచంద్ర, బి. ఎ., పిఠాపురం. 2. శీతంశెట్టి తాయారమ్మ, రాజమండ్రి. 3. విజయ రంగయ్య, మదరాసు. 4. ఇల్లూరు సాంబశివుడు, బెజవాడ.

"బ్రతుకు తెరువులులేవు నారాయణా! పట్టభద్రులమండి నా – యణా"




*Hindustan Times*

స్థితి యేర్పడింది నేడు బి ఏ డిగ్రీలు పొందిన విద్యార్థులు బి ఏ పూర్తిచేశాక కాన్వొకేషను గౌరవాలంది జీవచ్ఛవాలై ఉద్యోగాలకోసం దరఖాస్తులు చేతపట్టుకుని నడిబజారులలో తిరిగినా ఉద్యోగాలు దొరకడంలేదు. వీళ్లందరినీ దరిజేర్చడానికి ప్రభుత్వం యేమన్నా చేస్తే మహాపుణ్యంవుంటుంది

# దేశదిమ్మరి

అగ్నిహోత్రుడు

విశ్వకర్మ సంఘాభ్యుదయానికి పంచానన పత్రిక సుమారు 14 యేండ్లనుంచి విసుగు విరామం లేకుండా వెలువడుతూ వుంది. ఆ పత్రిక పుట్టినప్పుడు యెలావుందో యిప్పుడుకూడా అలాగే యెరుగు పొదుగులు లేకుండా వుంది. ఇందుకు కారణం ఆ సంఘీయులుపత్రిక యెడ అంత అభిమానం చూపక పోవడమనే అని తేలుతున్నది. ఇటీవల వెలువడిన ఆ పత్రికయొక్క ఒక సంచికలో ఒక కవి యిలా వ్రాశాడు.

"జాతివృత్తుల దెలుపు వ్యాసముల బొంది
విశ్వకర్మ వంశజు లభివృద్ధి నొంద
ననిశము బాటుపడెడి పంచాననాఖ్య
పత్రికను శంకరుండు గాపాడుగాత"

ఇక్కడ కూడా పత్రికను ఆ శంకరుడే కాపాడాలన్నారు గాని విశ్వకర్మ సంఘీయులు కాపాడాలని మాత్రం అనలేదు. దీన్నిబట్టే తెలుస్తుంది. యీ సంఘానికి స్వకార్యాలమీద యెంతటి అశ్రద్ధయో!

* *

సత్యమూర్తిగారు స్వర్గీయ సి. ఆర్. దాసు అంతటివారవాలని తంటాలు పడుతున్నట్టు కొంద రనుకొంటున్నారు. ఇది వరలో బందీనుండి బయటకు వచ్చిన తరవాత సి. ఆర్. దాసుగారు సింహంలా భారత దేశమంతా ప్రచారం చేసి స్వరాజ్య పక్షాన్ని స్థాపించి మహా తీవ్రంగా తంటాలుపడి ఆకరుకు యీ ప్రయత్నమంతా వట్టి వ్యర్థం అన్నట్టుగా ప్రకటించారు.

ఇప్పుడు సత్యమూర్తిగారు పిత్రీలు సిసింద్రీలు కాలుస్తున్నారు. ఇటూ అటూ తిరుగుతూ వున్నారు. హడావుడి యేమిటి! దానికొక మొదలు తుద లేకుండా వుంది. కాని యీయన ముఖంమీద యెంతటి గాంభీర్యతను తెచ్చుకొని యెంతటి అట్టహాసం చేయడానికి ప్రయత్నించినా ప్రజలు యీయన యెత్తులు అంతా యెరుగుదురు. వీరిమాటల్లో నూటికి యెన్ని వంతున పొల్లుగాయ లుంటాయో యెరిగి వాటిని చెరిగి పారవేయగలరు.

ఇట్టి పరిస్థితులలో మూర్తిగారు యింతటి శ్రమతీసుకొనడం అంత బాగా కనబడడము లేదు.

* *

వెనుకటికి స్వర్గీయ శంకరనారాయణగారు నిఘంటువును కల్పవృక్షంతోను కామధేనువుతోను పోల్చి వొక పద్యం వ్రాసి దాన్ని తమ నిఘంటువుమీద ప్రకటించారు. వారిమాటలో నూటికి నూరుపాళ్లు యథార్థం వుంది.

... ...

నిఘంటువు కల్పవృక్షమని మనం అంగీకరించినప్పుడు నిఘంటువును తయారు చేయడానికి పూనుకొనిన వారిని మహత్తర కార్యాన్ని సాధించడానికి నడుముకట్టా

రని వొప్పుకోవాలి. ఇటువంటి మహత్తర కార్యముల సాధించడానికి పిఠాపురంలోను మదరాసులోను ప్రయత్నములు జరుగుతూ వున్నయి.

పిఠాపురంలో సూర్యారాయ నిఘంటు కల్పవృక్షం తయారవుతూ వుంది.

మదరాసులో దక్షిణ భారత హిందీ ప్రచారక సంఘంవాళ్ళ "హిందీ తెలుగుకోస్" తయారవుతూ వుంది.

ఇవి రెండూ కల్పాంతముల వరకు తయారుకావని వాటిని తయారు చేసేవాళ్ల తరపున ఆంధ్ర మహాజనులకు నేను తెలియజేస్తున్నా. ఈ నిఘంటువులు కావాలన్న వాళ్లు తమ ఆర్డర్లను రిజిస్టరు చేయించుకొని తమ తమ ప్రతులకొరకు కల్పాంతము వరకు కనిపెట్టుకొని యుండాలి.

* *

నిజం వున్నది వున్నట్టు మాటాడితే తప్పు లేదు.

దక్షిణ భారత హిందీ ప్రచార సంఘం యొక్క చేయిదములు ఆంధ్రరాష్ట్రీయులకు అంత హితవుగా కనబడడము లేదు. మొదటనుండీ యీ సభ ఆంధ్రరాష్ట్రంపట్ల న్యాయంగా వర్తించడము లేదని అనేక మంది యెంతో కాలం నుండి అంటున్నారు. ఇన్నాళ్లు అక్కడ ఇక్కడ అనుకొంటూ వున్న విషయం యిప్పుడు బాహాటంగా అనడానికి అవకాశం కలిగింది. మొన్న బెజవాడలో జరిగిన ద్వితీయ ఆంధ్రదేశీయ హిందీ ప్రచార సమ్మేళనమున కధ్యక్షత వహించిన శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారు యిలా చెప్పారు.

"మద్రాసువారికిచెందు ఆదాయములో ఆంధ్రదేశమునుండి మూటికి రెండు వంతులు చెందుచున్నది. ఈ ధనము కేవలము ఆంధ్రదేశమున హిందీ చదువుకొను హిందీ విద్యార్థులదే యని చెప్పనగును. ముఖ్యముగ పల్లెటూరి డబ్బు అట్టి డబ్బులో నుండి వారికి మరొక విధము గానైనను ఒకదమ్మిడి చేరుట లేదు. వారి దేశమునకు దొరకుట లేదు. ఈ డబ్బంతయు తమిళదేశములో బస్తీలలో పెద్ద పెద్ద జీతము లిచ్చి ఖర్చు చేయుచున్నారు. గమనించదగిన విషయ మేమన ఒక్క తమిళదేశములోనె 8, తొమ్మిది ప్రచారకులు యున్నారు. అంతకంటె వింతయేమన ఒక్క మద్రాసు నగరమున నలుగురు ప్రచారకు లున్నారు. మద్రాసులో ఖర్చుపెట్టనంత యైనను ఆంధ్రదేశములో లేదు. యిచ్చట ఒక్క ప్రచారకుడైనను దక్షిణభారత హిందీ ప్రచారసభ వారి తరపున పనిచేయుచున్నట్లు తోచదు. కాన ఆంధ్రదేశమునందు ప్రచారము విరివిగ సలుపవలెనని ఒక హిందీప్రచార సభయుండు టవసరము" దీనికేమంటారో దక్షిణభారత హిందీ ప్రచార సంఘం వాళ్లు!

సి. రాజగోపాలాచారి గారు బందికానాలో వున్నారు, అంచేత యిప్పుడేమీ అనడానికి అవకాశం లేదు కాబట్టి అయన వచ్చేవరకు ఆగాలని అనరుగదా!

* * *

మీరట్ కుట్రకేసు సందర్భాన్ని ఎరెస్టు చేయబడి శిక్షింపబడి యీమధ్య విడువబడిన హాచిన్సుగారు ఒక పత్రికా విలేఖరితో సంభాషిస్తూ యిలా చెప్పారు:--

"ఇండియాలోని జైలు పద్ధతులు 15, 16వ శతాబ్దములలో ఇంగ్లాండులో అనుసరింపబడిన పద్ధతులలా వున్నయి. సాధారణపు బందీలయొక్క జీవితం చిన్నజైలు ఉద్యోగుల దాక్షిణ్యాం మీద ఆధారపడివుంది. చెప్పుకొనే నాగరకతకు యిది కళంకంగా వుంది."

మదరాసు రాజధానిలో మజ్జిగ అలవాటు ప్రతివానికీ వుందయ్యా, దాన్ని యియ్యండి అని యెంతో ఆందోళనచేస్తూ

వుంటే న్యాయసభ్యుడు ఆలోచిస్తున్నాం ఆ విషయం గురించి అంటూ యేళ్ళతరబడి అదే సమాధానం యిస్తూవస్తున్నారు.

* * *

ఆగస్టు 9-వ తేదీన ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో యీ క్రిందివార్త పడింది. ఎందుకన్నా మంచిది చదువుకోండి:—

"బ్రిటను దేశము ఇంగ్లాండుకు చెల్లింపవలసిన అప్పునకుగాను వాయిదా పద్ధతిని చెల్లింప వలసిన మొత్తములోని భాగంగా బొంబాయినుండి పంపబడిన **342** టన్నుల వెండి పాళాలు అమెరికా శాన్ ఫ్రాన్సిస్కో తీరమున ఓడనుండి దింపబడ్డాయి. వీటిని అమెరికా నాణెముల క్రింద మార్చడానికి ట్రెజరీ నుంచి టంకసాలకు పంపబడినవి.

* * *

ప్రత్యేకాంధ్ర రాష్ట్రప్రయత్నము గురించి వొక పత్రిక సంపాదకీయము వ్రాస్తూ ఆ సమయాన్ని యీ క్రింది యభిప్రాయాన్ని వెల్లడించింది:—

"బొబ్బిలిరాజా వారిని యెల్లపత్రికలు నేకగ్రీవముగ ఖండించుచున్నవి. కాని యింతమాత్రమున విశేష ప్రయోజన మేమియు నుండదు.

అది చాలవరకు నిజమే.

"ప్రత్యేక రాష్ట్రమున కగు తీవ్రవాంఛను ఆంధ్ర పత్రికలును, సభలును విశదీకరించుట యెంతయు అవసర మేయయ్యెను, ఆంధ్రులలో పెద్ద ఉద్యోగములను చేయుచు ఇంతో కొంతో ప్రభుత్వ విశ్వాసమునకు పాత్రులై యున్న మహనీయులు దీనిని సాధించుటకు బద్ధకంకణులు కానిదే యీ కోరిక యీడేరదు.........................

అని వ్రాసి ఆతరవాత మళ్ళీ యిలా వ్రాసింది.

"ఉత్కళ నాయకుల కున్న ప్రత్యేకరాష్ట్ర దాహములో సగమైనను మన మితవాద నాయకులకు లేనిచో ఈ కార్యము సానుకూలముగాదు. ప్రజల మెఱమెచ్చుల కొఱకు ఎంతో కొంతపని చేసినా మనిపించుకొనుచు, తీరా గవర్నరులు వైసురాయిల ముఖముల యెదుట మొగమాటము పడుచు నీళ్లుగార్చుచుండు నాయకులవలన విస్తారము లాభము కలుగదు.

ఇంక యీ మితవాద నాయకులనిలా హెచ్చరిస్తూ వుంది ఆ పత్రిక.

"నడుములు కట్టుకొని శూరులవలె రాయబారము వెనుక రాయబారమును ప్రభుత్వము వారితో నడపి దీనియొక్క అవశ్యకతను ప్రభుత్వమువారికి నచ్చజెప్ప బూనుకొనెదరాని................. తగినవారు కందిరీగలవలె దాని (ప్రభుత్వపు) చెవులచెంత సంగీతమును విరమించకుండ పాడుచున్నచో అది భ్రమరకీటక న్యాయము నందక మానదు. అయితే మనవారికి కందిరీగలకు గల అట్టి ఆసక్తి గలదేమో చూడవలెను. ఉత్కళ నాయకులు తమ పట్టును నెరవేర్చుకొని తమ కట్టి ఆసక్తి కలదని ఋజువుచేసికొనిరి. ధీమంతులగు మనమితవాద నాయకులు కూడ వారినుండి యీరీతిని నేర్చుకొని తమ ధీరత్వమును స్థిరపరచుకొనెదరు గాక.

ఈ పత్రిక ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కావాలంటుంది. అది బాగానే వుంది. కానియీ కార్యాన్ని సాధించడానికి మొనగాళ్ళు ప్రభుత్వముయొక్క "వేలాల" యిన మితవాదులేనట. కాని యీవాదన అంత సమంజసంగా కనబడడము లేదు. ఇంత వరకు మితవాదులవల్ల సాధించబడిన కార్యంగా వేలుముడిచి చెప్పడానికి వొక్క విషయం కూడా లేదు. ఏమంటే యేమి కొంప మునుగుతుందో, ప్రభుత్వానికి యేమి ఆగ్రహం వస్తుందో అని హడలుతూ అడుగడుగునకు భయపడుతూ వుండే వారివల్ల వొక్క కార్యము కూడా కాదు. అదీగాక మితవాదులు నడుములు బిగించి శూరులై యీ విషయాన్ని రాయబారముల మీద రాయబారములు సాగిస్తూ పోరాడాలట! శూరులు కావడము, పోరాడడ

ము మాటలు వదలివేస్తే మిగతవాళ్ళా న్ని మితవాదులు వినడానికి యెటువంటి అభ్యంతరము లేదు. అదీగాక రాయబారములు నెరపడానికి నడుములు బిగించడం గాని శూరులు కావడంగాని అవసరం లేదు. డబ్బు ప్రోగుచేసి యిస్తే లెక్కలేనన్నిసార్లు సిమ్లా ఢిల్లీలకు లండనునకు రాయబారములు నెరపడానికి వీరు దివారాత్రాలు సిద్ధమే. కానియీమితవాదలసలహాలను ప్రభుత్వం యెప్పుడూ లెక్క చేయదు. మితవాదులు ప్రభుత్వం వెనుకనే తాళం వేస్తూవుంటారని ప్రభుత్వాధికారులు యెరుగుదురు. అంచేత మితవాదులమీద ఆ పక్షపు పత్రికలే యెటువంటి ఆశను పెట్టుకోననప్పుడు యీ పత్రిక ఆస బెట్టుకోవడం వట్టి భ్రమ అనిపిస్తూ వుంది నాకు. అదీగాక మొదట మితవాదుల మెత్తదనమును అంగీకరించి ఆతరవాత శూరులై వీరే యేమన్నా చెయ్యాలి, వీరివల్లనే యేమన్నా కావాలి, కాగలదు అనడం చూచిన నేను ఉక్కిరిబిక్కిరి అవుతూ వున్నాను.

ఇంతకూ నా ఉద్దేశం యేమిటంటే దేనికన్నా ప్రజాభిప్రాయం ప్రధానం. ఘట్టి ప్రజాభిప్రాయం వుండి పట్టినపట్టు విడువకుండా వుంటే యెటువంటి కార్యమన్నా సాధించడానికి అవకాశం ఉంటుంది. ప్రజల అభిప్రాయం గడ్డ కట్టుకుంటే అంతా నెరవేరుతుంది. మితవాదులవల్ల దమ్మిడియెత్తు ప్రయోజనముండదు.

* * *

ఎస్. యన్. ఘోష్ గారు "ఇండియన్ మిరర్"లో వ్రాస్తూ హిందూ మహాసభ యొక్క వార్షికోత్సవ సందర్భంలో నేపాళదేశపు మంత్రి అధ్యక్షత వహించడం అన్యాయ మంటున్నారు.

వీరి వాదన అర్థరహితమై యుంది. నేపాళపు మంత్రి హిందువు లైనప్పుడు హిందూమహాసభకి అధ్యక్షత వహించడములో తప్పు యేముంది? ఏ ఛాందస మూర్తినో ఆ గద్దె కెక్కిస్తే యీయన సంతోషించేలాగు వుంది! వీరికి వున్నది వొకటే భయం. స్వతంత్ర వాతావరణంలో పెరుగుతూవున్న ఆ యధికార మూర్తి యీ ప్రాంతములకు వస్తే యిక్కడ మతముపేర సాగింపబడుతూ వున్న అన్యాయములను మోసములను కళ్లారా చూచి తల వాచేటట్లు చీవాట్లు పెడతాడు. ఆ ఖండనము చూచి ప్రజాబాహుళ్యం నిజం తెలుసుకుని తమకు జరుగుతూవున్న అన్యాయాన్ని గమనించి యింకముందు అటువంటివి జరుగకుండేలాగు చూచుకొంటారు. అటువంటిది జరుగరాదని కామోసు ఘోష్ గారి ఉద్దేశం.

సత్యాన్ని యెంతకాలం అలా ప్రజలనుండి మరుగుపరచి ఉంచుతారు?

## రాలిన పూలు

కృతికర్త శ్రీ తుమ్మలపల్లి సీతారామారావుగారు, ప్రకాశకులు సాహిత్య మండలి, బెజవాడ.

రాయల్ 16 సైజున ౫౮ పేజీలలో వెలువడిన యీ గ్రంథం మొదట చూపునకు ముచ్చటగా వుంది. గ్రంథం గద్య కవిత్వముతో నిండినది కవికి అప్పుడప్పుడు పొడముతూ వచ్చిన భావములను లలిత పదముల లో యిమిడ్చి దండగుచ్చాడు భావములు తునకలై కథారూపముల దాల్చినవి అన్నింటిలోనూ మరుగుబడి కనబడుతూవుండివిషాదచ్ఛాయ ఒక విధమైన "తత్వబోధనము" ఒకవిధమైన "సమస్య" ప్రతిపుష్పం చివరను అస్ఫుటంగా కనపడుతూ వుండడమే యీ గ్రంథంలోని గొప్పతనం. చదువడానికి మహా మృదువుగా వున్న పదములతో యీ గ్రంథం అన్నివిధములా ఆకర్షణీయంగా వుంది

## మహాభాషితరత్నాకరం

కర్త: గాంధిమహాత్ముడు ప్రకాశకులు కొమ్మూరు కాశీవిశ్వనాథం గారు, తెనాలి.

మహాత్ముని గురించి పరిచయవాక్యములు వ్రాయడముకన్న వెర్రితనం యింకోటి వుండదు. అంచేత ఆపనిని తెలివిగా వదలివేయాలి ఈ గ్రంథంలో సత్యపథము, హింసాస్వరూపములు, బ్రహ్మచర్యము, పర ద్రవ్య విముఖత్వము, స్వార్థవిరహితత్వము, నిర్భయత్వము, అస్పృశ్యత, కాయకష్టము, మతము, స్వదేశీ వ్రతము, కర్మయోగము మున్నగాగల 22 ప్రత్యేక ప్రకరణము లున్నాయి మహాత్ముడు యీ పవిత్ర విష యముల గురించి అతి సులభముగ, ప్రతివానికి అర్థమయ్యేలాగు యీ వ్యాసములలో వ్రాశాడు ఈ గ్రంథము ఆంధ్రగృహము లందలి ప్రతివ్యక్తి హస్తములలోనను వుంటే ఆంధ్రరాష్ట్ర మెంతో బాగుపడు తుంది. తెనుగించిన పద్ధతి కూడా బాగుంది శైలి సులభము ఈ వుత్తమ కార్యమునకు గడంగిన శ్రీ విశ్వనాథంగారు దీనికొక **Pocket edition** కూడా వేస్తే యెంతైనా బాగావుంటుందని మా యభిప్రాయం


## ఆత్మత్యాగి

అనువాదకులు శ్రీ కూచిభొట్ల ప్రభాకర శాస్త్రిగారు, ప్రకాశకులు శ్రీ కొమ్మూరి కాశీ విశ్వనాథం గారు, తెనాలి [క్రౌన్ ఆక్టవో సైజు ౯౨ గ్లేజు పుటలు, వెల ౫ అణాలు ]

మాతృక హిందీలో వుంది దాన్ని శ్రీ ఆదిత్య ప్రసన్నరాయలు వ్రాశారు దానిని అనువాదకులు అటునటు కొలది స్వంత కల్పనలతో తెనుగించారు

కర్మయోగి జతీంద్రుని పవిత్ర వీరజీవితమే యిందలి అత్యుత్తమ వస్తువు. ఈ మహాత్యాగి 63 దినాలు బందికానాలో న్యాయస్థాపనకై నిరశన వ్రతమును సాగించి దేశమునకై — న్యాయస్థాపనకై ప్రాణములు విడ చెను ఇంత చిన్నతనములోననే యింతటి పట్టుదలను ప్రదర్శించిన యువనాయకుడు ఆంధ్రయువకుల కాదర్శ మూర్తి కాగలడు ఈ గ్రంథము టెక్స్టుబుక్ కమిటీ వారిచే పాఠశాలోప యోగమున కామోదింపబడి యుండుట సంస్తవనీయము ఉన్నతాశయములను బాలురకు చూపగల యిట్టి గ్రంథములను పఠనీయ యోగ్యములు గావించిన యెడల యీ కమిటీ వారెంతయు సేవచేసిన వారయ్యెదరు గ్రంథము మృదు భాషను రచింపబడింది త్యాగశక్తి యొక్క ఉత్కృష్టతను ప్రభావమును ప్రతి పుటయందును విశదీకరించు చున్నది ప్రతిపాఠశాలయు యీ గ్రంథమును బాలురకు పరిచయమొనరించును గాక

బొంబాయికి కొరడా దెబ్బలు




బొంబాయిపౌరులు —దౌష్ట్యాన్ని దుర్మార్గత్వాన్ని మీ రెంత ఖండించినా నిందితులను కొరడాదెబ్బలు కొడతామని మీ రనేసరికి మేమంగీకరించ లేకున్నాం చివరకు దాని ప్రయోగం చాలాదూరం వెళ్లుతుంది అది నాగరకతకు విరుద్ధం

న్యాయసభ్యుడు—పరవాలేదు మీరు భయపడనవసరంలేదు కొరడా ప్రయోగం మహా మెత్తగను, నున్నితంగాను జరుగుతుంది అది రామతారకంలా పనిచేస్తుంది

[బొంబాయి శాసనసభలో కొరడాదెబ్బలు కొట్టడమును ఆమోదిస్తూ ఒకచట్టమును తయారుచేసింది]

# నాయకులా? వినాయకులా?

"వి నా య కు డు"

ప్రస్తుతం ఆర్థికదురవస్థ ప్రపంచాన్ని యెంతతీవ్రంగా పట్టుక పీడిస్తున్నా ప్రపంచంలో పెండ్లిండ్లు, శోభనాలు, కథలు కార్యములు యెవరియింట వాళ్లు వరుసగా సాగిస్తూనే వున్నారు. వాటికిమాత్రం యెటువంటి ఆటంకములున్ను రావడములేదు. విందులు, విహారాలు, యిచ్చిపుచ్చుకోవడములు, లాంఛనములు వగయిరా కర్మకాండ అంతా సాగుతూనేవుంది అటువంటి సమయములో ప్రజాభాహుళ్యానికి ఉపయోగపడే కార్యంగాని విషయంగాని వచ్చిందంటే 'ఆర్థిక దురవస్థలో పడి నలిగిపోతూవున్నాం, యిప్పుడేమి చెయ్యడమండీ, యీమాటుకుమట్టుకు మమ్మల్ని వదలివెయ్యండి' అంటారు. ఇది ప్రపంచంలో మామూలు అయిపోయింది. ఇటువంటివాళ్లకు స్వార్థమే ప్రధానమైయుంది కాని మరేమీకాదు. ఇది ప్రజాసమూహముంయొక్క పద్ధతి

ప్రజాసమూహములలో కొందరు కొంచం యెక్కువ ఆలోచించి కొంచం యేమన్నా మేలుచేదాం ప్రపంచానికి అన్న తలంపుతో మొదట బయల్దేరి ఆ అదనపు ఆలోచనలను బాహాటపరచి యేదో కొంత కార్యక్రమం యేర్పాటుచేసి దాన్ని అనుసరించడము మొదలుబెడతారు. ఇలా కొంతవరకు ప్రజోపయోగ కార్యములలో కృషిచేసిన వాళ్లు ప్రజలయొక్క మన్ననలకు పాత్రులై క్రమేణా నాయకత్వమును వహిస్తారు. ఈ విధంగా పలుకుబడి సంపాదించుకొనిన నాయకులు ఆంధ్రదేశంలో ప్రతిగ్రామంలోనూ వున్నారు. ఈనాయకులు ఆప్రథమదివసములలో చేసినసేవను అంతా పొగడుతూవుంటారు. అంతవరకు బాగానేవుంది.

కాని ఈనాయకులు యిప్పుడు కొంత మందత్వాన్ని సోమరితనాన్ని పరాకును చిత్తగించారు. అన్ని వేళలలోనూ యీనాయకులే యితరపనులు వదలుకొని యీపనినే చేయాలని నే ననడములేదు. ఏదో చేయాలనివుంది, చేశారు. అంతటితో ఆసేవ ఆగింది. సరే. కాని సేవచేయడ మనేదే లేకుండా మట్టంగా వట్రువగుమ్మడికాయల్లా కూచునివుండే అది చేశారు యిదిచేశారు అంటూ పత్రికలలో వ్రాయించుకొనడం యేంన్యాయం? నాయకత్వం వహిస్తూవుంటేనే నాయకుడౌతాడు. అంతేగాని, మేం, యేమీ చెయ్యము, మాకుమట్టుకు పేరుకావాలిఅంటే అదివీలా? కాని యేదో నాయకుడయాడనగానే అతన్నిచూస్తే కొంచంభయం. మనకెందుకు యీాయన్నిఅనడం అని ప్రజలు ఊరుకుంటున్నారని అన్యాయంగా పేరుప్రతిష్ఠలు సంపాదించుకొంటూ పనిమాత్రంచేయకుండావున్నవాళ్లు యెందరోవున్నారు. ఉదాహరణంగా యీామధ్యసాగిన

హరిజనోద్యమంచూడండి. ఆంధ్రపత్రికలలోని వార్తలుచూస్తే యీఉద్యమ సంబంధంగా యేదో కొంతజరిగినట్టుగానే ప్రకటింపబడి వుందికాని యేమీ లేకుండాలేదు. ఆవార్తలుచూచిన నాకు నిజంగా యీరాజధానిలో మన ఆంధ్రులే యీమహత్తరసామాజికవిషయంలో అగ్రతాంబూలం పొందుతారని గర్వపడుతూ ఇతరరాష్ట్రీయులతో అంటూఉండేవాణ్ణి. కాని "హరిజన" పత్రికలో చాలాపని జరుగుతూవున్నట్టుగా అన్ని రాష్ట్రాలగురించిన్నీ వార్తలు ఉండేవిగాని మనరాష్ట్రంగురించి మహా అరుదుగావుండడమంచేతనా అనుకొన్నా. ఆంధ్రులు నిరాడంబరజీవులు, కార్యాచరణమేగాని యీ మెరుగులన్నీ వాళ్ళకు నచ్చవు అని నాకునేనే సమాధానం చెప్పుకొన్నా. కాని యీ మధ్య ఆంధ్రదేశంలోని అనేకగ్రామములు వెళ్ళిచూస్తినిగదా, నాఆశలు అడుగంటినయి. మనస్సు చివుక్కుమనిపోయింది. ఆంధ్రపత్రికలోని హరిజనోద్యమంతో యీ అసలు పరిస్థితులనుపోలిస్తే పత్రికలలోని వార్తలన్నీ పట్టిఅబద్ధాలుగా కనబడ్డాయి. నిజంగాజరిగినపని మహాకొద్ది. ప్రకటింపబడినవార్తలు విపరీతము. నాయకులంతా వినాయకులయి యున్నారు. పాపం, శ్రీయుతులు మాగంటి బాపినీడు, ఆచార్య గోగినేని రంగనాయకులు, చెరుకువాడ నరసింహం, కొండా వెంకటప్పయ్య గొల్లపూడి సీతారామశాస్త్రిగార్ల వంటివారు కొందరే యీ ఉద్యమవిషయమై దివారాత్రములు హృదయపూర్వకంగా ప్రచారంచేశారు. వారిప్రచారఫలితంగా కొన్ని కొన్ని ప్రదేశాలలో కొంత చక్కని సంస్కారము కలిగింది; కాని మిగత నాయకులంతా కేవలం వినాయకులయారు. ఏదన్నా స్వంతపనిమీద యేవూరన్నా వెళ్ళితే పోలేరమ్మజాతరతోకలిపి గ్రంథాలయ వార్షికోత్సవం జరిపినట్టుగా ఆపనిసందర్భంలో యీపనీఅంటూ యేదో ఒక అర్థగంటపాటు ఉపన్యాసప్రవాహం ప్రవహింపజేయడమే జరిగిందికాని మరేమీకాదని అనిపించింది. ఆయాగ్రామస్థులనడిగితే ఇక్కడ యేమీలేదండి, పెద్దవారెవ్వరూ శ్రద్ధతీసుకొనలేదు అంచేత ఆమాట యెత్తడానికే వీలులేదు అంటూవచ్చారు. దీన్నిబట్టి గ్రామనాయకులంతా వినాయకులయినారని స్పష్టమవుతూవుంది. ఆంధ్రనాయకులారా,ఇటువంటి వర్తనం యెంతమాత్రమున్నూ తగదు. మనం యీరాజధానిలో క్రమేణా ఇతర శాఖలకన్న వెనుక పడిపోతూవున్నాం. అది గమనించండి. సామాజికవిషయములో పనిచేసేందుకు మీకువచ్చే ఆటంకములు యేమీలేవు. ఆవిషయం మీరు జ్ఞప్తివుంచుకోవాలి. ఇంకనన్నా మీరు వినాయకత్వమునువదలి నాయకత్వము వహించాలి. ఆలస్యం చేయకండి, లేవండి!

# బెజవాడలో వ్యభిచారపుటంగళ్లు

ఆంధ్ర విశ్వవిద్యాలయముయొక్క కేంద్రకార్యాలయం మావూళ్లో ఉండాలంటే మావూళ్లో వుండాలంటూ హోరాహోరి పోరాడిన నగరములలో బెజవాడ నగరం వొకటి. ఈబెజవాడ నగరంయొక్క ప్రాశస్త్యంగురించి చెప్పమంటె బెజవాడ పురవాసులు ఒక్కొక్కరు యింతింత ఉబ్బిపోతూ, ముక్కుపుటములు పొంగిస్తూ "బెజవాడ— విజయడ' చరిత్ర ప్రసిద్ధమైనది. పేరుగాంచిన ఇంద్రకీలాద్రివుంది. కృష్ణాస్రవంతి హాయిగా ప్రవహిస్తూవుంది. పూర్వం బౌద్ధమతానికి ఒక ఉనికిపట్టు పురాణనగరం. కనకదుర్గవుంది. పెద్ద రైల్వే కూడాలి. ఆంధ్రదేశ మధ్యస్థనగరం" అంటూ యేమేమో చెపుతారు.

ఎవరి నగరం గురించి వారు చెప్పుకొనడములో తప్పు యేమీలేదు. తన నగరము అంటే అభిమానం ఉండాలిసిందె. కాని అంతటి అభిమానంగల బెజవాడ పురవాసులు నగరంయొక్క పారిశుధ్యానికికూడా కొంతవరకు పాటుపడవలసిన అవసరంవుంది. అవిషయముమాత్రం బెజవాడపౌరులు పురపాలకసంఘసభ్యులు పూర్తిగా మరిచిపోయినట్లుగా వుంది. ఇలా అంటే బెజవాడ పౌరులు ఆగ్రహంతో మండిపడవచ్చు. కాని యదార్థం చెప్పవలసివచ్చినప్పుడు ముక్కుమీద గ్రుద్దినట్లు చెప్పవచ్చు. అందుకు జంకవలసిన అవసరం కొంచంకూడా లేదు.

బెజవాడ నగరంయొక్క ఆకారాన్ని సంస్కరించడానికి సుందర దృశ్యాల్ని కల్పించడానికి పురపాలక సంఘం యెంతమాత్రమున్ను పాటుపడడములేదు. అందచందాలతోకూడిన ఆవిషయము అలాఉంచి అన్నిటికన్నా ముఖ్యమైనది చూదాం.

బెజవాడనగరం రేపోమాపో మహానగరం (City) కావలసివుంది. అటువంటప్పుడు నగరంయొక్క నైతికభాగంకూడా చక్కజేయబడవలసి వుంది. బెజవాడలో పెద్దపెద్ద సత్రములు ఉన్నయి. ఈసత్రములకు అనేక ప్రాంతములనుండి యాత్రికులు కుటుంబములతో వచ్చి మకాంచేస్తారు. వాళ్లకు గ్రామంలోనిపద్ధతులు తెలియవు అంచేత ముఖ్యంగా సత్రములు ఆ పరిసరప్రదేశములు చక్కగా వుంచబడాలి. బెజవాడ పురపాలకసంఘం యీసందర్భంలో తన విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించుటలేదని మాచార్జి. బెజవాడ స్టేషనుకు సమీపంలోనేవున్న రామగోపాలు సత్రముయొక్క పరిసరములను దృష్టిలో వుంచుకొని యిది వ్రాస్తున్నాం. చీకటి పడిందనేసరికల్లా—రైలువంతెన దిగి పెద్దరోడ్డునపడి వెళ్తుతున్నామనే సరికల్లా భయానకదృశ్యాలు కనబడుతూ వుంటయి వ్యభిచారవృత్తి నవలంబిస్తూ జీవయాత్ర గడిపే అభాగినులగు స్త్రీలు అనేకతరహాలగా ఆప్రాంతముల తిరుగుతూ క్రొత్తవారిగా కనబడినవారిని అమాయకులను చూసి పెడత్రోవలకు యీడుస్తూవుంటారు.

## బెజవాడలో వ్యభిచారపు టంగళ్లు

ఈవ్యభిచారస్త్రీలు అనేకమంది రైలువంతెనవద్ద కాచుకొని వచ్చేపోయేవాళ్ళను 'భోజనానికి వస్తారా, భోజనానికివస్తారా' అంటూ వేపుకొని తింటూవుండేవారని బెజవాడగ్రామస్తులే అనేక వింతయైన ఘోరమగు సంఘటనాలను చెపుతారు. అంతటి ఘోరాలు, కొంతవరకు యీదృశ్యాలను చూడలేని కొందరు పోలీసు కాన్‌స్టేబిలుల యొక్క మంచితనంవల్ల తగ్గిందనికూడా తెలుస్తూవుంది. వ్యభిచారిణులు దారులవెంట తిరిగే యీపద్ధతితగ్గినా సత్రానికి రెండువైపులా వ్యభిచారిణులు నివాసములు యేర్పాటుచేసుకుని చీకటిపడినతరువాత ఆప్రాంతములనుతిరిగే ప్రజలను వేధించుకుతింటున్నారు. కడకు రామగోపాలుసత్రపు ప్రాంతములకు చాలా చెడ్డపేరువచ్చింది. చుట్టుప్రక్కల గ్రామాలనుండి యెవరన్నా స్త్రీ పారిపోయిందంటే మొట్టమొదట యీసత్రము యొక్క చుట్టుప్రక్క ప్రదేశములను వెతకుట కలదని అనేకమంది చెప్పుటకలదు.

వ్యభిచారవృత్తిని సాగించడమే తప్పు. అటువంటప్పుడు ఆ నీచపువృత్తిని నడివీధులలో ఘోరంగా సాగిస్తూవుంటే పురపాలకసంఘంవారు చూస్తూ వూరుకోవడం యెంతమాత్రమున్ను బాగాలేదు. నగరముయొక్క నీతికి యిదొక కళంకము. ఇటువంటి అలవాటు యేనగరానికిన్నీ రాగూడదని మావాంఛ. అందువల్లనే ఉన్నవిషయాన్ని నిర్భయంగా నిర్మొగమాటంగా వ్రాయవలసివచ్చింది. దీనిని చదివి బెజవాడపౌరులు కొంత ఆగ్రహంచెందిన చెందవచ్చు కాని అటువంటి ఆగ్రహానికి యెడము లేదేమోనని మాఅభిప్రాయం. జీవనోపాధిలేనివారు కడకు యీవృత్తిలో దిగుతున్నారన్న సంగతిని మేమంగీకరిస్తాం. అటువంటి సమయమున పురపాలకసంఘం తనచేతనైనంతవరకు గౌరవ విధానముల ననుసరించి జీవనోపాధి గడించుకొనడానికి దార్లు యీఅభిగినులకు చూపడానికి ప్రయత్నించి యీవిధంగా వ్యభిచార జీవనము గడపేవారిని సన్మార్గములను మార్పవలసివుంది. ఈప్రయత్నములకు బెజవాడ పురపాలకసంఘం పూనుకుంటే మదరాసు-వ్యభిచార నిర్మూలనాచట్టముయొక్క సహాయాన్ని పురపాలకసంఘంకూడా మధుర, శ్రీరంగము మున్నగు పురపాలకసంఘములకువలెనే పొందవచ్చు. కనుక బెజవాడపౌరుల యొక్క ఆరోగ్యమును నైతికవర్తనమును కాపాడడానికిగాను పురపాలక సంఘసభ్యులు వెంటనే పట్టుదలతో ప్రయత్నించెదరు గాక.

# జమీందారులగూడు పుఠాణీ




బొబ్బిలిరాజాగారు — మాజమీన్ రైతులారా, రాష్ట్రమందలి ఉదారహృదయులగు జమీందారులు, సభలో మీామొరలాలింప విజయముచేసియున్నారు జమీందారులను నమ్ముడు అభయహస్తమంది రక్షణమందుడు

జమీను రైతులు — అయ్యా, మాకు సభలువద్దు సమాలోచనలువద్దు మావద్దనుంచి జమీందార్లకు రెండుకోట్ల 25లక్షల రూపాయలఆదాయం, మాకు అన్నీ అవస్తలె సభలు అసలువద్దు మాకేమీా పెద్ద రక్షణవద్దు ఇండియా గవర్నమెంటుభూములలోని రైతులకుగల యింతభారం మాకు వుంటేచాలు ఆమాత్రం చెయ్యండి, సభలువద్దు, జట్టీలువద్దు

# తిన్నయింటి వాసములు లెక్క-బెట్టడం

ఒకఊరిలో ఒకాయన ఉన్నాడు. ఆయనకు వచ్చిపోయేవాళ్లకు ఆతిథ్యం యియ్యడమంటే యెక్కు-వఆస. అంచేత యెవరన్నా యాత్రికులు వచ్చారంటే వారికి తనయింట తగిన సదుపాయములు చేస్తూ వుండేవాడు. అదీగాక ఆగ్రామంవచ్చి కుదుట పడదామనుకున్నవాళ్ళకు ఆధార్మికుడు అండగా నిలిచి దారిచూపి ముందుకుతెస్తూవుండే వాడు. ఇలా వుంటూవుండగా ఒకనాడు ఒకాయన ఆధార్మికునియింటికి వచ్చాడు. అతని పరిస్థితులుచూచి ఆధార్మికుడు ఆప్యాయంగా తనయింటికి తీసుకువెళ్లి గౌరవించాడు. ఆగ్రామంలో కొంత పలుకుబడి కలిగించేందుకు తగిన మార్గాలన్నీ యేర్పాటుచేయడము మొదలుబెట్టాడు. ఈయేర్పాటులన్నీ జరిగేసరికి కొంతకాలం అయింది ఆపనిలోతిరుగు తూవున్న ధార్మికుడు తిరిగి యింటికి వచ్చేసరికి ఆతిథ్యం పొందుతూన్న అతడు, 'నీవెవ రవు? యీయింటికి యెందుకువచ్చావు?' అని ప్రశ్నించాడు.

ధార్మికుడు ఆశ్చర్య చకితుడయాడు. "ఏమండీ యిలాఅంటారు? నన్ను గురుతు పట్టలేదు కాబోసు!" అంటూ చిరునవ్వు నవ్వాడు.

ఆతిథ్యమందుతూవున్న యాతడు అందుమీాద మాటాడుతూ "ఏమయ్యా, యి దేం, వింతగా మాటాడుతూ వున్నావే! ఇది నీయిల్లా? అలాఅయితే యీయింటికియెన్ని వాసములున్నాయో చెప్పు!" అన్నాడు.

ధార్మికుడు ముక్కు-మీాద వేలు వేసుకొన్నాడు. అతను మాటాడలేదు. నిర్ఘాం తపడ్డాడు.

తిన్నయింటివాసములు లెక్క-బెట్టినవాని వర్తన లానేవుంది స్వధర్మ స్వరాజ్య సంఘంతరఫున జాయంటుపార్లమెంటరీ కమిటీయెదుట సాక్ష్యంయియ్యడానికి బిళ్ళగోచీ బిగించి లండనుకు పరుగెత్తిన ఎం. కె. ఆచార్యగారి వర్తనం! మొట్టమొదట యీ ఎం. కె. ఆచార్యగారు పేరు ప్రతిష్ఠలకోసం ధార్మికునివద్ద ఆతిథ్యం పొందడానికివచ్చిన వానిలాగునే ధార్మికుడైన గాంధీమహాత్మునివద్ద చేరాడు. కాంగ్రెసులో క్రమంగా అమహానీయుని ధర్మమా అంటూ ముందుకువచ్చాడు. కాస్త పేరువచ్చింది, యింక నాయకుణ్ణి లెక్క-చేయవలసిన అవసరంయేది? ఇదివరకు గాంధీమహాత్ముడు రెండవ రౌండుటేబిల్ మహాసభకు వెళ్ళినప్పుడు 'నేను భారతదేశంలోగల ప్రజలలో నూటికి తొంబదిమంది వంతునగల ప్రజలతరఫున నేను మాటాడుతూవున్నాను, వారితరఫున నేను ప్రాతినిధ్యం వహిస్తున్నాను' అనిచెప్పాడు. ధార్మికుడైన మహాత్మునివల్ల ముందు కువచ్చిన ఎం. కె. ఆచార్యగారు యిప్పుడు తిన్నయింటివాసములు లెక్క-బెట్టినవాని లాగున ఆపార్లమెంటరీ కమిటీయెదుట సాక్ష్యంయిస్తూ "గాంధీగారికి-భారతదేశంలోగల వారిలో 100కి 95మందితరఫున మాటాడడానికి అంతమందితరఫున ప్రాతినిధ్యతవహించ

డానికి అర్హతలేదు. ఆయన తగడు. నేనే-స్వధర్మస్వరాజ్యసంఘం తరపున వచ్చిన నేనే-మాటాడగలనని మొదలుచెప్పి తరువాత "గాంధీమహాత్ముడు హిందులనందర్నీ తన కార్యసాధ్యనకొరకు ఉపయోగించుకొంటున్నాడు, నేను హిందులందరితరపునను మాటాడడానికి వచ్చా" అని అన్నారు. ఆచార్యగారి మాటలు విన్నవారంతా అక్కడ నవ్వినట్లుగా వార్తలు. ఆచార్యగారి స్వధర్మ స్వరాజ్య సంఘం గురించి యిదివరకు ఇండియాలో యెవ్వరూ వినలేదు. యిదే క్రొత్త, అది యేమూలవుందో యెవ్వరికీ తెలియదు అంటూ—కమిటీయెదుట సాక్ష్యమియ్యడానికివచ్చిన ఒక భారతనారీమణి తెలిపింది. సర్. ఏ. శి. పాత్రోగారు ఎం. కె. ఆచార్యగారి వింత సాక్ష్యమును విని 'నేను మిమ్మల్ని యిరవైయేండ్లుగా యెరుగుదును, మీపద్ధతులుఅన్నీ నాకుతెలుసు. మీరు మాత్రం విపరీతంగా యిటువంటిమాటలు మాటాడకండి, జాగ్రత' అన్నారు.

పాపం, స్వర్గానికిపోయినా విడాకులు తప్పలేదన్నట్లు ఇండియాలో అర్థంలేని సనాతనవాదమునుచూచి మాటాడనియ్యరు సరేకదా, లండనులో పోయి యేదోచెప్పుకొందామంటే అక్కడకూడా అవకాశంలేదు! పాపం!

ఎం. కె. అచార్యగారు సాక్ష్యంయిస్తూ భర్త చనిపోతే అతనితోకూడా భార్య చితి మీద ప్రాణాలతోయెక్కి (యిష్టంమీద) మండిపోతే అటువంటిస్త్రీని తాను దేవతగా మ్రొక్కుతానన్నారు. ఆ తెల్లదొరలు, భారతీయ సభ్యులు అంతా పక్కుమని నవ్వారు.

పాపం ఎం. కె. ఆచార్యగారు హిందూ మతోద్ధారణానికిగాను యెంత తంటాలు పడుతూవున్నారు! పాపం ఆరువేలమైళ్ళ దూరంలోవున్న ఆరాజ్యానికివెళ్ళిన ఆచార్యగారు యింటికి వచ్చినతరవాత బంగారుతీగతో నాలుక కాల్పించుకొని ప్రాయశ్చిత్తం చేయించుకోవలసి వుంటుంది కామోసు! ఇంతటి శ్రమకోర్చిన వీరికి స్వధర్మస్వరాజ్య సంఘపు ఛాందసులు యేదన్నా శాశ్వతచిహ్నాని గౌరవంగా యేర్పాటుచేస్తే బాగా వుంటుంది.

# అంధ ప్రేమ

## శ్రీ కృత్తివాసతీర్థులు

మా బాబుగారికి కోర్టులో నెలకు నూరు రూపాయలు జీతము, కాకినాడలో ఉంటున్నారు. అయిదుగురు బిడ్డల్లో నేనే పెద్దదాన్ని. బాబు ఎల్లాంటి కష్టాలు పడుతున్నాడో మీరు ఊహించండి. మేము చంటిపిల్లలమప్పుడు, బాబు ఇంటిపెత్తనము అదోలా చూచుకొనేవాడు. పిల్లలంతా బళ్లోకివెళ్లేకాలానికల్లా అప్పుల్లో మునిగిపోయాడు. మా తాతగారు సంపాయించిన ఆస్తి నలభైయెకరాల కొబ్బరితోటా, అమ్మినారు. మేము అస్వతంత్రుల మయ్యాము.

ఇక మా కష్టాలు ఆరంభించాయి. అప్పటికి నాకు పధ్నాలుగేళ్లు నిండాయి. పెళ్లి కానిదాన్ని, తండ్రి కట్నకానుకలు ఇవ్వలేడు. కట్నం ఇస్తేనేకాని మంచివరుడు దొరకడు. భగవంతుడు నాయందు నిర్దాక్షిణ్యం వహించినాడు. పోనీ నాకు సౌందర్యం ప్రసాదించేడా అంటే, అదీలేదు. ఎంతగొప్పవారి పిల్లయినా, ఎంత చదువుకొన్నదైనా పిల్లమట్టుకు రూపరిగా ఉండాలి. ప్రతిపిల్లా తాను సౌందర్యంతో ఉండవలెనని, పోనీ చూచేవారికైనా అందంగా, నాజూకుగా కనపడవలెననీ ప్రయత్నిస్తుంది. ధనవంతులు తమ కుమార్తెలకు చక్కనిబట్టలూ, ఆభరణాలు మొదలైనవన్నీ ఇస్తారు. అల్లాంటివేమీ మాకులేవు. దానికికారణం డబ్బులేక పోవడమే.

చాలాకష్టంతో మా బాబు నాలుగేళ్లు వెళ్లదీశాడు. గవర్నమెంటులోగాని, జమీందారీలోగాని ఉద్యోగిగా ఉన్నవాడికి ముడెట్టేద్దామని మా బాబు ప్రయత్నము, కాని అది వ్యర్థమైంది. కొంతకాలమయ్యాక పెళ్లికాని ఓగుమాస్తాకు నన్ను ముడెట్టాలని యత్నించాడు. అతగాడు అంగీకరించలేదు. బాబు విసుగెత్తి వేసారిపోయాడు. నేనేమి చెయ్యగలను? నేను రూపవతిగా ఉండవలెనంటే నాకు సాధ్యమవుతుందా? అది దైవికము, చింతించి నిష్ఫలము, అనుభవించితీరాలి.

ఎప్పుడు పెళ్ళాడుదామా అని నాకు తొందరగానే ఉన్నది. ఎవరైనాసరే పెళ్ళాడ్డానికి వెనుదియ్యను. నాపెళ్లి జననీజనకులకుఆనందము ఇస్తుంది. కానిఎవ్వళ్లనీ పెళ్ళాడకపోవడమే అప్పుడు మంచిదైంది. పెళ్లాడేఉంటే ఓపెద్ద అమూల్యరత్నాన్ని పోగొట్టుకునేదాన్నే.

భాస్కరం మాయింటి పొరుగుమనిషి. నిజానికి వాళ్లయింటి ప్రహరీలోపల మేము వేరే ఇంట్లో ఉంటున్నాము. భాస్కరం మేమున్నచోట వకీలు. అతనికూతురు, శాంత నాకంటె రెండేళ్ళుపెద్ద. మేము చప్పున స్నేహితులమయ్యాము. చంటిపిల్లలప్పుడు బీద భాగ్యం అనే తారతమ్యం తెలియదు. శాంత పిఠాపురంలో హైస్కూలులో మేనమామగారింట్లో ఉండి చదివింది. తర్వాత కాకినాడలో పిఠాపురం మహారాజావారి కళాశాలలో ఇంటర్మీడియేట్ చదివి అక్కడ కుదరకపోవడం మూలాన రాజమహేంద్రవరంలో కళాశాలలో బి. యే లో చేరింది. ఎప్పుడైనా శాంత కాకినాడవస్తే చూడడానికవెళ్లి కొంతసేపు కబుర్లాడేదాన్ని. ఓసంవత్సరంలో నాయందు ఆమెకు గొప్ప మార్పుకనిపించింది.

శాంత ధనవంతులకుమార్తె చదువుకొన్నదికదూ! నేను ఆమెను గ్రహించాను నాలోగూడా ఓమార్పువచ్చింది నేను పేదవానికూతుర్ని, రూపవతిని కాదని స్పష్టంగా తెలుసు. నిజానికి శాంత నాజూకుగా బహుకోమలంగా పండు తమలపాకులా ఉంటుంది. అస్తమానం సిల్కు ఊదామబ్బురంగుల చీరెలు కట్టుకొంటుంది. ముఖానికి వింతసోయగం వచ్చేలా పౌడర్లురాస్తుంది. నడుస్తూంటే లేత దేవదారు మొలకలా ఊగిసలాడిపోతూ, చెవులకు లోలక్కులం కదలుతూ నడుస్తుంది. పాముతోకలా జారెడు జడ కదుల్తూ చూచేవాళ్లకు విభ్రమము గొల్పుతూ ఉంటుంది. చేతికి గడియారం, మెళ్లో సన్నగొలుసు వేళ్లాడుతూ ఉంటుంది. కాళ్లకు జోడు వేస్తుంది. శాంత సౌందర్యవతి అనేచెప్పాలి. ఆమె యెదట మరొకరిరూపాన్ని పొగడడం భాష్యం

కాదు. అలాఅయినా శాంత సౌందర్యాన్ని పొగడక తప్పిందికాదు.

త్రియంబకం శాంతకు సహపాఠి. నరేంద్రపురంలో ఉన్న మేనమామ అతన్ని దత్తత చేసుకొంటానని చెప్పినాడు. త్రియంబకం పట్టపరీక్ష ప్యాస య్యాక ఇంగ్లండులో ఐ. సి. యస్, చదవడానికి వెళ్ళుతాడు. భాస్కరం తనకూతురికీ అతని మైత్రికి తోడుపడినాడు. వేసంగిసెలవుల్లో త్రియంబకం భాస్కరందగ్గిర అతిధిగా ఉన్నాడు. శాంతకు అవి ఆనందదాయకమైన శుభదినాలు. వాళ్లిద్దరూ ఖులాసాగా కబుర్లాడడం తర్కించుకోవడం. వేళాకోళాలూ, జరిగేవి. మహానందంగా కాలం గడిపేవారు. నేను శ్రోత్రియకుటుంబములో దాన్ని అవడం మూలాన శాంత అతనితో జంకులేకుండా అలా ఉంటుందేమి చెప్మా అనుకొనేదాన్ని సుమండీ! వాళ్లిద్దరూ అల్లా ఉండడము నాకు అట్టే బాగా తోచలేదు. నేను శాంతను చాటుగా పిలిచినాను. 'అమ్మాయీ! వేణూ! ఇలాచూడు.' శాంత నాతో చెబుతూంది, "త్రియంబకం నన్ను ప్రేమిస్తున్నాడు. నేను అతన్ని ప్రేమిస్తున్నాను. నేను అతనిహృదయంలో స్థానము ఏర్పరచుకొన్నాను. మాబాబుకు ఇదంతా తెలుసు. మేము డిగ్రీలకోసం నిరీక్షిస్తున్నాము.-- మేము ఖులాసాగావుంటే నువ్వు ఆక్షేపించడం ఎందుకు? వెర్రిదానివి నువ్వు!" శాంతమాటలు నచ్చలేదు.

నేను త్రియంబకాన్ని రెండుసార్లు చూశాను. అతగాడు ఉదారహృదయుడు, స్ఫురద్రూపి, పెద్దమనిషి. ఎందుచేతనోగాని త్రియంబకం శాంతనుపెళ్లాడితే అట్టే సుఖం ఉండదనుకొన్నాను. అలా అనుకోవడానికి కారణం నాకు తోచలేదు. కారణం తెలుసుకోగలిగాను. త్రియంబకం మేనమామ అతన్ని ఐ. సి. యస్. చదివించాలని అభిప్రాయం. అయితే దానికి వ్యతిరేకంగా కళాశాలలో ఉపన్యాసకుడుగా ఉండాలని అతని ఆశయము. శాంతకు అలాచేయడం ఇష్టములేదు. భర్త చాలాధనం గడించాలనీ కొంత దేశోపకారంక్రింద ఖర్చుపెట్టాలనీ ఆమె ఉద్దేశ్యము, అతనికి ఇచ్చలేదు. వ్యతిరేకముగా చెప్పినందుకు ఆమెకూ ఇష్టంలేకపోయింది. అతనికి ఉపద్రవంగా కోపంవచ్చింది. అప్పుడు నేను అక్కడేవున్నాను. వెళ్లిపోదామని సమయంకోసం నిరీక్షిస్తున్నాను.

"వేణూ, నేనెల్లాచేస్తే బాగుంటుంతో చెప్పు. గవర్నమెంటు నౌకరీచేస్తూ బాగా ధనంగడించాలనా, లేకపోతే విద్యావ్యాపకముకోసము జీవితము ఖర్చుపెట్టవలెనో, ఆఫీసరుగానుండి దేశోద్ధారణము చెయ్యడము నీచంగా తలచను. విద్యాప్రబోధము కోసం జీవితం ధారపొయ్యడం ఇంకామంచిది. నా అభిప్రాయం ఎలావుంది?" అని త్రియంబకం నన్నడిగినాడు.

"వేణూ! నువ్వు జడ్జివి నీఅభిప్రాయం చెబుతూ మాదెబ్బలాటతీర్పు'" అన్నది, శాంత.

ఏమిచెయ్యడానికీ తోచలేదు. ఖంగారుపడ్డాను. బలహీన నయ్యాను.

"మీరు విద్యకోసం జీవితము వినియోగించడం ఉత్తమము." ఈమాటలు అతికష్టంతో నోరు పెకల్చుకొని పలికినాను. ఎంతో సిగ్గుపడ్డాను.

"వేణు అభిప్రాయం నాతో ఏకీభవిస్తోంది." అన్నాడు తను.

"మరే. ఆమె అల్లానేచేస్తుంది. ఈవిషయంలో వేణూ మీరూ వకటిఅయితే, మీరు ఆమెను పెళ్లాడండి. ఏమీతెలియని అనాగరిక అమాయిక విద్యావిహీన అయిన వేణు మీకు సర్వవిధాలా తోడుపడుతుంది. దేశోద్ధారణచేయడం ఆమెకు వెర్రిసరదా," అన్నది శాంత.

శాంత చటుక్కున హాలువదలి పోయింది. ఓభగవంతుడా ఇల్లా ఎందుకు జరగాలి? ఇద్దర్నీ సంతోషింప చేద్దామని ప్రయత్నిస్తే వ్యర్థమైనది.

త్రియంబకం శాంతి వహించాడు.

"సరేగాని వేణూ, శాంతకు కోపంవచ్చింది. మాటఅంటె చెడ్డపట్టింపు. ఓమాటమట్టుకునమ్ము. ఆమెహృదయము వెన్నముద్దలాంటిది."

తెల్లారినప్పుడు ఇదంతా జరిగింది.

అస్తమానమయ్యేసరికి శాంతా త్రియంబకులు మోటారులో కూర్చుని షికారు వెడుతున్నారు. నాకు ఆశ్చర్యంవేసింది. త్రియంబకం శాంతను పెళ్లాడ్డానికి సమయం సమీపించింది. వేళాకోళం చేదామనుకొన్నా. పొద్దోయాక శాంతను సమీపించాను.

"శాంతా! తెల్లారుజామున త్రియంబకంమీద నీకు చెడ్డ ఉక్రోషం వచ్చింది. సాయంకాలమయ్యేసరికి ఇద్దరూ వకటైనారు."

"మరే వేణూ! అంతా మరిచిపోయాను." అని కొంచెం సంతోషంతో శాంత చెప్పెను.

"మాకు పరస్పరభిన్నాభిప్రాయాలున్నా ఒకరినొకరు ప్రేమిస్తున్నాము. ఇద్దరం ఒకటే. ఓసంగతి చెప్పనీ వేణూ! మేము మాట్లాడుకొనే సమయాన నువ్వు మాదగ్గరకూర్చుంటే నాకెంత ఇష్టం ఉండదు. అది చాలా తప్పనుమీ."

మనస్సు చివుక్కుమన్నది ఆమాటలు వినేసరికి. శాంతకు నామీద ఈర్ష్య? నేను రూపసిని కాను, పేదవాళ్ళపుత్రికను. ధనవంతునికుమార్తె సౌందర్యవతి ఆమెకు నామీద కోపం ఎందుకు? రాత్రి నాకు నిద్దరట్టలేదు. సుఖంగాలేను.

"నువ్వూ వేణూ ఒకటయితే ఇద్దరూ పెళ్లాడండి" ఈమాటలు చెవుల్లో మారుమోగేయి. యదార్థంగా అల్లా మాట్లాడుతుందని అనుకోలేదు. అయితే ఇవ్వాళమాత్రం-

* * *

సంవత్సరంగడిచింది. విజ్ఞానప్రబోధానికి తోడు పడుతూ, దేశీయాందోళనలో చేరుదామాఅని త్రియంబకం అనుకొన్నాడు. పట్టపరీక్ష అయ్యాక ఇంగ్లండు వెళ్లి చదవడంమానుకొన్నాడు. హిందూ సేవాసంఘములోచేరి గ్రామోద్ధరణానికి పూనుకొన్నాడు. మేనమామకు ఇతనిమీద పెద్దకోపం వచ్చింది. ఇతని హృదయంలో మార్పుకు అంతా ఆశ్చర్యపడిపోయారు. మేనమామ త్రియంబకానికి డబ్బుపంపడం మానేశాడు. త్రియంబకం పాశ్చాత్యనాగరికతమీద ఇచ్ఛ వదలి, తనవేషముమార్చి స్వదేశీఉద్యమం నిమిత్తము గ్రామాల్లో సంచారంచెయ్యడం సాగించినాడు. భాస్కరానికి శాంతకూ త్రియంబకం విషయం అదోలా తోచింది. అతన్ని విడిచిపెట్టినారు. తనదగ్గర త్రియంబకంపేరు చెపితే భాస్కరానికి అసహ్యంవేసేది.

"త్రియంబకంమీద అంత ఆగ్రహం వహించావేమిటో?" అని రాజమండ్రీనుంచి కాకినాడ ఆమె వచ్చాక ఒకరోజున నేను అడిగాను.

"నీవతన్ని ప్రేమిస్తున్నావని నువ్వేకదూ చెప్తా!"

"అబ్బే లేదు! వేణూ, అల్లా నేనెప్పుడూ అతన్ని ప్రేమించలేదు. అతను నన్ను ప్రేమిస్తున్నానని నాతో చెప్పినాడు. నేనలాగే చేశాననుకొన్నాను. ఆవిషయాలు, మాట్లాడానికి ఇప్పుడుఅవకాశంలేదు."

త్రియంబకం సంగతి ఏమైందో ఎవరికీ తెలియలేదు. ఆరునెలలయ్యాక శాంత పెద్దడాక్టరును పెళ్లాడినట్లు తెలిసింది. భాస్కరం చాలా ఘరానామనిషి. గొప్ప డాక్టరు అతని అల్లుడు.-ఇహ కావలసిందేమిటి? అంతా అతన్ని 'రావుసాహెబ్' అని పిలిచేవారు. అతగాడు ఆనాకారి అనే చెప్పాలి.

నాకు ఇరవైయేళ్ళు పైబడ్డాయి. ఇన్నిసంవత్సరాలనుంచీ నాకు పెళ్లిచేద్దామని బాబు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నాడు. చిగురుకు ఒకాయన దొరికినాడు. తొందరగా మాఅమ్మ పెళ్లిప్రయత్నాలుచేస్తోంది. మేము మామూలుపద్ధతులు మార్చుకొన్నాము పెళ్లివిషయంలో సంస్కారపద్ధతిమీద వివాహం గనుక ఇతరులకు క్రొత్తగా తోస్తుంది సుమండీ! పెళ్లికి పెళ్లికొడుకుగారి ఊరికి తర్లి వెళ్లాలి. పెళ్లికొడుకు ఎవరో మాబాబు ఎవళ్ళకుచెప్పలేదు. ఆరేళ్లనుంచీ సమ్మంధాలు నిరర్థకమై పోయేసరికి ఈసంబంధమేనా గుట్టుగా ఉంచాలని మాకు తెలియబరచలేదు. పెళ్ళికొడుకు ఎవరో తెలుసుకోవలెనని నాకు ఆదుర్దా జాస్తిఅయినది. ఒకటి రెండుసార్లు ఆవిషయం మాబాబును అడగవలెనని ప్రయత్నించాను. అలాఅడగడం భావ్యంకాదని ఊరుకొన్నాను. మాబాబు కష్టాల్లోంచి గట్టెక్కుతున్నాడు. అదే నాకు కావలసింది.

ఆ శుభదినము త్వరగా సమీపిస్తోంది. అక్రిందటి రోజు తెల్లారుఝాముబండికి మాఊరువదిలాము. మేము వెళ్ళవలసింది హరిశ్చంద్రపురం. పెళ్లివారం నలుగురమే. నాపెళ్లికి అంతకంటె ఎవరువస్తారు? అది వేదోక్తంగా జరగాలి. సాయంత్రానికల్లా హరిశ్చంద్రపురం చేరాము. కరణం ఇరవైబళ్లతో స్టేషనుకు వచ్చాడు. మేము ఎంతమందో వస్తామని అనుకొన్నాడు. మానలుగుర్ని చూచేసరికి అతను హతాశుడయ్యాడు. అతనితోకూడ వచ్చినవాళ్లు మాకు సదుపాయాలు చెయ్యడం మొదలుపెట్టారు. మమ్మల్నిచూస్తూఉంటే ఎంతోసంతోషం వేసింది. నేను అతని సోదరుని భార్యనవుతూంటే నాకుమట్టుకు సంతోషం కాదూ?

"ఇదంతా ఎందుకోయ్? మన త్రియంబకం అదృష్టవంతుడే" ఆయన వెంటఉన్నవారితో అన్నాడు. అతను ఇంకేదో మాట్లాడబోతూవుంటే అడ్డు తగిలాడు బాబు.

"త్రియంబకం ఏత్రియంబకం! వెనకటిత్రియంబక మే?" ఈప్రశ్నలు నాచిత్తములో సినీమాబొమ్మ ల్లా పరుగెడుతున్నాయి.

"ఈత్రియంబకం అతగాడూ వకటయితే--అబ్బ ఎంత హాయిగాఉంటుంది! చదువురాని అనాకారి దాన్ని ఎందుకు పెళ్ళాడుతాడు?"

ఊళ్లో త్రియంబకానికి పెళ్లిఅవుతుందనీ అంతా సంతోషించారు. ఎరుగున్న ఆడాళ్లంతా పెళ్ళికి వచ్చారు. అపనీ ఈపనీ ఎవరు చేయగలిగింది వారు చేశారు. మర్నాడు ఉదయాన్నే త్రియంబకం గృహి ణిని అయ్యాను. అయితే ఈత్రియంబకంఎవరుచెప్మా?

నేను పెద్దదాన్నే గనుక సిగ్గుపడవలసిన పనిలేదు. అతనికేసి చూడనైనా చూడలేదు. చిగురుకు ఎలాగో లాగు అతనికేసి చూచాను యదాలాభంగా. పూ ర్వం శాంతను పెళ్ళాడుతానన్న త్రియంబకమే!! అరెర్యా అతనికి దృష్టిదోషం వచ్చింది? నేను అంధు ణ్ణి పెళ్ళాడి ఏమిసుఖపెడతాను? నేనతన్ని పెళ్ళా డడము ఇష్టమే. అతనికి గుడ్డితనం రావడానికి నేను విచారించాను. అయితే ఇంకా నేను అతన్ని ప్రేమి స్తున్నాను. ప్రేమకూడా గుడ్డిదేకదూ? ఆరాత్రల్లా దుఃఖించాను. దుఃఖంవల్ల హృదయానికి శాంతికల్గింది.

నా పెళ్లి అయ్యాక మా బాబు, అమ్మ రాజమండ్రి వెళ్లిపోయారు. నేను భర్తతో ఉన్నా ను.నాథర్త తన కథయావత్తూ నాకుచెప్పినాడు. గవ ర్న మెంటుఉద్యోగి కాలేదని మేనమామ అతనిమీద అసహ్యాపడ్డాడు. అందుచేత ఆస్తియావత్తూ మరో బంధువు అజమాయిషీకిందఉంచి తాను గ్రామోద్ధర ణానికి పాటుపడ్డాడు. హరిశ్చంద్రపురంలోనే ఉం టూ అక్కడికి దగ్గరగా ఉన్న వీధిబడి తానుతీసు కొని పిల్లలను బోధించడం సాగించాడు. తెలియని వాళ్ళకు ఆరోగ్యము వ్యవసాయమునుగురించి చెబు తాడు. మంచి పలుకుబడివచ్చింది ఓరోజున అక్కడ అగ్ని బయలుదేరింది. ఒకరెల్లుగుడిసె వీతిహోత్రుడికి ఆహుతిఅయింది. మూడేళ్లచంటిపిల్ల లోపల నిద్దరో తూంది. లోపలకు వెళ్ళడానికి ఎవ్వరూ వడుముకట్టలేదు. నాథర్త లోపలికిపోయి చంటిపిల్లను రక్షించారు. ఆయనకళ్లు పోయాయి, ప్రాణాలు మాత్రం పోగొట్టుకోకుండా ఒడ్డుపడ్డారు.

సంఘసేవకోసం జీవిత మర్పిద్దామని ఆయన అభి ప్రాయము, వివాహం డబ్బుఖర్చు అనుకొన్నాడు. కాని నేత్రాలు కనపడకపోయేసరికి సాయంకావలసి వచ్చింది. వారి ఊళ్లోవాళ్ళంతా అతన్ని పెళ్ళాడమని ప్రోత్సహించారు. నాథర్తను తన్నుప్రేమించి కాపా డుతూ వుండేవారు ఎవరైనా ఒకరుంటేమంచిదనిపించి నది. అప్పుడు నేను అతనికి జ్ఞప్తికివచ్చాను. వెంటనే మాబాబుకు ఓజాబువ్రాసినాడు. ఈజాబుచూసి బాబుసంతోషించి సంబంధానికి సమ్మతించాడు.

"అయితే వేణూ, నిన్ను మోసగించాలని ఇల్లా చెయ్యలేదుసుమ్మా. నేను అంధుణ్ణనేవిషయం నీకు తెలి యబరచమని మీమామకువ్రాశాను. నీ వంగీకరిస్తే పెళ్ళాడ్డానికి తయారుగా ఉన్నానని వ్రాశాను. "మీబాబు నీకీవిషయంగురించి చెప్పేరా?" ఆయన నన్ను ప్రశ్నించినాడు.

"నాకేమీచెప్పలేదు. దానికేమి జాబువ్రాశారు మాబాబు?" అడిగాను.

"నీవు సంపూర్ణముగా అంగీకరించావని వ్రాశా రు. వేణూ నిజంచెప్పు. నన్ను పెళ్ళాడినందుకు నీజీ వితమంతా బూడిదలో పన్నీరులా వ్యర్థమైందని తలుస్తున్నావా?"

"అబ్బే? అలాఎప్పుడూ అనుకోను. మీపత్ని నయినందుకు ఎంతోసంతోషం. సంఘాన్ని ఉద్ధ రిద్దామనుకొంటే మీకు అంధత్వము చేకూరింది. నాకు హృదయేశ్వరుడంటే ప్రాణంకంటె ఎక్కువ. నేనె ప్పుడూ మిమ్మల్ని వెన్నంటి మీకు ఏదికావాలంటే అది చేస్తూంటాను."

నానేత్ర కువలయాలు ఆనందబాష్ప పరిపూరితా లయినాయి. హృదయము వెన్నలా కరిగిపోయింది.

"నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?" భర్తప్ర శ్నించాడు.

"ఎందుకలా అనుమానం? మిమ్మలిని గాఢంగా ప్రేమిస్తాను." ఇంకా నేనేమో చెప్పబోయానుకాని నానోరు అప్రయత్నంగా మూతపడింది.

"తిరిగి నన్ను ప్రేమిస్తారా?" అని నవ్వుతూ భర్త నడిగాను.


"నేను తెలివితక్కువ, చదువురాని అనాకారి దాన్ని, ఇల్లాంటిది ఉండడము ఇష్టమేనా?"

"ఎంచేత! నీలాంటిది నేత్రములు తెరుచుకొని ఉండగా నన్ను పెళ్ళాడి గుడ్డిగాప్రేమిస్తే, గుడ్డివాడి నైన నేను నిన్ను ఎందుకు గుడ్డిగాప్రేమించను? నిజంగా ప్రేమ గుడ్డిదవునా కాదా?"

మాకు ఇల్లా సరిసాలాపాలు జరిగేవి ఇంకా ఎన్నో కులాసా కబుర్లాడేవాళ్ళము రోజూ ఏదో వింత చెప్పేవారు మధ్యాహ్నంపూట కుర్రాళ్ళకు పాఠాలు చెప్పడం, రాత్రిపూట ధర్తక పుస్తకాలు చదివిపెట్టడం, ఆయనచెపితే నేను వ్రాసి వ్యాసాలు పత్రికలకు పంపడం కద్దు వ్యాసరచనవల్ల డబ్బుగడిం చేవారం పల్లలంతా ఆయనను వెర్రి అనురాగంతో చూచేవారు సోదరుణ్ణి అడిగినట్లుగా ఏది కావాలిస్తే అది వారినిఅడిగేవారు ఆయనప్రోత్సాహంవల్ల విజయనగరందగ్గర స్వదేశీనిలయం సహకారసంస్థ స్థాపించారు బీదవాళ్లు చదువుకోవడానికి ఉచితమైన గ్రంథాలయముస్థాపించారు మాకు డబ్బు అట్టే రావడము లేదు ధనంవల్ల సౌఖ్యమువస్తుందంటే నాకునమ్మకం లేదు మాకేమి డబ్బుంది? మేము ఆనందంగా కాపురం చేస్తున్నాము నాకేమీ అక్కర్లేదు అంధభర్త నుంచి గుడ్డిప్రేమనే సంపాదించడం కావలసింది ప్రేమ గుడ్డిదవుతుందా?

---కథావింశతి నుండి

## పట్టపగలు ప్రాణాలు తీయడం'




పవిత్రమైన హిందూమతముయొక్క మెడకు ఉరిత్రాళ్లువేసి స్వార్థం అనే కొసబట్టి అర్చకులు, అధి అధికారం అనే కొసనుబట్టి మఠాధిపతులు లాగుతూవున్నారు వీళ్ల ఆగాయిత్యంవల్లనే హిందూమతం తుని యలై తునియలై అంతం కానుంది.

# పెరటి భూరుహము

శ్రీ యం. కె, వేంకటసుబ్బారావు.

ముకుళముల బెడఁగు కలకంఠముల మెఱుంగు
తలిరుటాకుల సొంపు నెత్తావి పెంపు
ప్రతతి వితతులసారు భ్రమరములతీరు
తరువు నందము దినము నేత్రముల విందు.
పొలుపొందు సంఫుల్లపుష్ప గుచ్ఛంబులు
డంబై వెలుంగు మకుటంబు గాఁగ
మకరందమునుగ్రోలు మత్తాళి ఝుంకృతుల్
తనరారు నిగమ నాదములు గాఁగ
గలియంగఁగప్పిన కమ్మ పుప్పొడికాంతి
కమనీయమగు మేని కాంతిగాఁగ
పాదపంబునఁబ్రాకు వల్లీ సమూహంబు
లంచితదివ్య భూషాళిగాఁగ
జుట్టు నలరారుచుండెడి సుమరజమ్ము
కాంతి వెలిదమ్మి గద్దియ కాంతిగాఁగ
సకల శాస్త్రార్థతత్త్వ విచారుఁడైన
వనజగర్భునిఁబోలు నప్పాదపంబు.
కొమరారు పుష్పగుచ్ఛముల సత్కాంతి సి
తాంబుజాక్షముల ద్యోతంబుగాఁగ
జిగురుటాకులయందు నిగిడిన కెంజాయ
కమనీయ కౌస్తుభకాంతిగాఁగ
బొలుపాఱు తరుమూలమున నీలపుం గాంతి
రుచిరంపు విగ్రహా రోచిగాఁగ
నలరారు పండుటాకుల కాంతి రమణీయ
కాంచనాంబర దివ్య కాంతిగాఁగ
రమణ నొప్పారు కుసుమపరాగకాంతి
లలితమైయొప్పు శేషతల్ప ప్రశస్త
కాంతిగాఁగ రమాకాంత కాంతుఁడైన
వనజనాభునిఁ బోలు నప్పాదపంబు.

పల్లవాంకురములఁ బఱిఁగిన కెంజాయ
    కాంతి జటాచ్ఛటా కాంతిగాఁగ
నెల్లెడన్గప్పిన చల్లని పుప్పొడుల్
    భవ్య విభూతిలేపనముగాఁగ
సుమరసంబులఁగ్రోలు భ్రమరసంతానంబు
    మహిత రుద్రాక్షదామములు గాఁగ
దరువున కెగఁబ్రాకు తారుణ్యలతికాళి
    యలరెడు నురగ భూషాళిగాఁగ
  ప్రబలదళసరమైన పర్ణంబులెల్ల
  హస్తిచర్మాంబరముగాఁగ నఖిల వైభ
  వంబు లొప్పారు కైలాసవాసుఁడైన
  పార్వతీపతిఁబోలు నప్పాదపంబు.
ప్రాభవోన్నత మహిమాభి రాముఁడై
బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వస్వరూప
ములను సాక్షాత్కరించిన భూరుహంబుఁ
బోలు భూజము ముల్లోకములను గలదె.

## తుంగభద్ర ప్రాజక్టు

తుంగభద్ర ప్రాజక్టు వివరములు తెలియవచ్చినవి. హైదరాబాదు ప్రభుత్వము వారు మల్లాపురం వద్ద నదికి అడ్డముగ 'డాము' కట్టనిశ్చయించిరి. అచట 100,000,000 ఘన అడుగుల నీరు నిలువయుండు రిజర్వాయరు కట్టెదరు. పెద్దకెనాలు 140 మైళ్లు పొడవుండును. చిన్న కాల్వలతో గూడ మొత్తము 215 మైళ్ల పొడవుండును. 3500 మైళ్లు వరకు యీ నీరు ప్రవహింప జేయబడును. ఈ ప్రాజక్టువలన మొత్తము 10 లక్షల యకరముల భూమి సాగుచేయుటకు పనికివచ్చును. సమష్టి జలాశయమునుండి హైదరాబాదు ప్రభుత్వము వారును మదరాసు ప్రభుత్వమువారును చెరిసగము నీరు తీసికొనుచుందురు. 19 లక్షలలో 12 లక్షల యెకరములు సాగునకు సిద్ధముగ నున్నవి. ప్రాజక్టు పూర్తియైన పిదప మొత్తము రూ 41 లక్షల రాబడి యుండును. అంచనాలను ఉభయ ప్రభుత్వముల వారును ఆమోదింపవలసి యున్నది. వారు ఆమోదించిన వెంటనే పని ప్రారంభమగును. (భాగ్యనగరపత్రిక.)

## హోరు ద్వారా జరిగే గారడి




జాయింటు పార్లమెంటరీకమిటీ భారతప్రతినిధులు —'అయ్యా, శామ్యూల్ హోరుగారూ, 'క్రమానుగతంగా' వస్తుంది, అనేకాలనిర్ణయం గింటలకోలత మానం లేకుండాచేసి, కాంగ్రెసువాళ్లు వద్దంటున్న ఆ తెల్ల కాగితమువ్వా యియ్యండి

బ్రిటీనులోనికొందరు స్వార్థపరులు —హోరుగారూ, ఖబర్దార్! ప్రజాస్వామ్యపు గోలను లెక్కచెయ్యవద్దు కాలక్రమానుగతముగ అనే ఊపిరి విషయం వదలవద్దు జాగ్రత

మార్లేమాంటెగో ఛాయలు —అయ్యో, హోరూ, మేము యింతకష్టపరిస్థితులలో పడ్డాం, కాని యెప్పుడూ కాలక్రమానుగతమనే గంటల మాయలో ప్రజలను గారడీ బుట్టలో వేయలేదు పాపం అమాయకులగు భారతీయులు!

# అణిగింది అదరిపాటు

శ్రీ యలమర్తి సీతారామస్వామి

మార్చి అయిపోయింది కాలేజీకి సెలవులిచ్చారు. 'ఊరంతా ఒకదోవ, ఉలిపికట్ట దొకదోవ' అని,—అంతా వేసవికాలంలోని ఎండలకు హడలుబుట్టి నీలగిరి వెళ్లుతూవుంటే 'జననీజన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అని కుగ్రామం అయినప్పటికి నేను మావూరుచేరాను బ్రతుకుజీవుడా అని.

మావూళ్లో ప్రతిరోజూ సాయంత్రం నాలుగయిదుగంటలవేళ నేను, మాస్నేహితులిద్దరు ముగ్గురుకలసి షైరుకు వెళ్లేవాళ్లం. వెళ్ళి మామిడితోటలో ఒకసహకారభూరుహంక్రింద కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పుకున్నేవాళ్లం. మేము ఇలా ఒకనాడు లోకాభిరామాయణం ఏదో చెప్పుకుంటూవుండే సమయంలో ఎక్కడనుండో వచ్చాడు మాదగ్గర కొకమనుష్యుడు. అతని ఎడమచేతిలో ఒకకఱ్ఱవుంది. కుడిచేతిలో ఒక ఇత్తడిపాత్రవుంది. ఆమనిషిని చూడగానే నాకు 'కవిరాజు' గారి 'కురుక్షేత్ర సంగ్రామం'లోని, 'ఒంటికై వాఁడు కోయిల కంటివాఁడు, బోడితల వాఁడు ముదికోతి మొగమువాఁడు.' అను చరణాలు జ్ఞాపకం వచ్చినయ్, 'పానకంలో నిపుడకలాగ' అతడు మాదగ్గి-కొచ్చి 'బాబూ, బాబూ' మీరంతా ధర్మాత్ముల్లాగా వున్నారుచూస్తే, ఈదీనుని కధవిని సహాయంచేయండి మీశక్తికొలదిన్ని అని అన్నాడు. మాస్నేహితులు విసుక్కున్నారు. 'రామాయణంలో పిడకలాట' లాగు నూతనపురుషుడువచ్చి తనకథ మొదలుపెడతానన్నందుకు మాస్నేహితులకుకోపం వచ్చి వెళ్లిపొమ్మన్నారు అతణ్ణి. కాని ఆపురుషున్నిచూస్తే నాకెందుకో జాలివేయసాగింది. అతడు బ్రతికిచెడినవానిలాగ గోచరించాడు నాకు. అతని ఉదంతాన్ని వినాలనిపించింది నాకు. నామిత్రులను వారించి, నూతన పురుషుని కూర్చుండచేసి, అతనికథ చెప్పుమన్నాను. 'సరే'అని ఆ పురుషుడు సాగించాడు తన స్టోరీని యీ విధంగా—

"అయ్యా! వినండి. మాది గోపాలపురము. నేను మావూళ్లోనే స్కూలుఫైనలు ప్యాసయి విజయనగరం వెళ్ళాను ఇంటర్ జూనియర్ చదవటానికి. నేను సామాన్యంగా దుర్వ్యయంచేస్తూ వుండేవాణ్ణి. కాని మావూళ్లో వున్నంతకాలం మాతల్లిదండ్రులుదగ్గరే వుండటంవల్ల నాఆటలు-సాగేవికావు ఏమిన్ని. నాచేతికి డబ్బువచ్చేదికాదు ఏమాత్రమున్ను. అందుకని 'చెప్పుక్రింద తేలు'లాగ పడివుండవలసి వచ్చేది. కాని నేను విజయనగరంవెళ్లినతర్వాత నాకు స్వేచ్ఛ బాగాదొరికింది ధనవ్యయంచేయడానికి. 'పేనుకు పెత్తనమిస్తే తలంతా చెడగొరికిం'దన్నట్టైంది. అక్కడ నన్నడిగేవాడు ఎవడూ లేకపోవడంచేత, అంతా నాయిష్టమే అవడంచేత డబ్బు ఖర్చుపెట్టడం సాగించాను ధారాళంగా క్రిందూమీదూ తెలి

యతుండాను. 'పిల్లాడికేం తెలుసురా వుండేలుదెబ్బ' అన్నట్టు, డబ్బు దొరకనికాలంలో మానాన్న అష్టకష్టాలుపడి నెలనెలకూ నలభైరూపాయిలు పంపుతూవుంటే, 'అవ్వతీసినగంధం తాతబొజ్జకుసరి' అని ఆడబ్బుఅంతా ఖర్చుపెట్టేవాణ్ణి దుబారాగా విచారించకుండా.

నేను చదువుతుంది జూనియరుక్లాసు. అపుడు క్లాసుపరీక్షలేగదా అని అశ్రద్ధచేశేవాడ్ని పూర్తిగా. దృష్టులన్నీ ప్రపంచ సుఖావళిపై మళ్లినయ్ 'డబ్బులేనివానికి డంబాచారమెక్కు' వన్నట్లు మేము ధనహీనులం అయినా, నాడాబుసరికిమాత్రం ఏమాత్రం తక్కువుండేదికాదు. 'సవారి బయటబెట్టరా, సందెబిచ్చానికి పోవా'లన్నట్టు భాగ్యహీనుణ్ణి అయినా నాషోకులకుమాత్రం లోపము వుండేదికాదు.

ప్రతిదినం లేచి దంతధావనంచేసి కాఫీ హోటల్లోకివెళ్ళి ఒకమూల 'శతకోటిలింగాల్లో బోడిలింగాన్ని జూశావా' అని కూర్చుండేవాడ్ని. ఒక పావులావదిలించి బైటకొచ్చి కిల్లీవేసుకుని, కత్తెరమార్కు సిగరెట్టుకాలుస్తూ హిందూపేపరుకొని, ప్రక్కఉన్న కుర్చీలోకూర్చుని చూస్తూ వుండేవాడ్ని. పేపరువంకబుద్ధి అటుఇటూ పోతున్నప్పటికిన్నీ, చదివేది అర్థంగాకపోయినప్పటికిన్నీ అతనికంటె ఘనుడుఆచంట మల్లన్న అన్నట్లు, నాకంటె పైవాళ్ళు నా స్నేహితులిద్దరున్నూ. వాళ్లెప్పుడు నాతోటిటు తిరిగేనాళ్లు. మేమంతా కలిసి పారగడం సాగించంగానే విద్యావిహీనత్వం, షోకుబలియటం ధనవ్యయం సంభవింప సాగినయ్. "అమ్మాయికి అన్నీవున్నయ్ అయిదోతనం దప్ప" అని మాకు అన్నీ వున్నా సైకిల్ లేకపోయింది. ప్రక్కఉన్న విద్యార్థులదగ్గర అప్పుదీసుకుని సైకిల్ ఒకదాన్నికొన్నాం. ఇల్లా మానాయనపంపిన డబ్బు అయిపోగా ఇతరులదగ్గర అప్పుజేసి పప్పుగూడుదినటం సాగించాను.

"విగ్రహఃపుష్టి నైవేద్యనష్టి" అన్నట్టు చదువు సంధ్యా ఏమీలేకపోయినా, పట్టుపుట్టాలు, సిల్కుషర్టులు మొదలైనవాటిని ధరించేవాణ్ణి ఎప్పుడునూ. అప్పుడప్పుడు డబ్బుదొరకక మానాయన మామూలుకంటె తక్కువగా పంపించుతుండేవాడు. "గుడ్డిమింగేవానికి లింగం ఒకలెఖ్ఖా" అని ఆడబ్బుఅంతా ఖర్చుపెట్టేవాణ్ణి వచ్చిన అయిదు నిముషాలికే.

ఆసంవత్సరమే నాకు వివాహంఅయింది. "వివాహే విద్యానాశాయ సర్వం నాశాయ శోభనం" అని వివాహంకాగానే నాచదువు అసలే సన్నగిల్లిపోయింది. తరువాత కొన్నాళ్లకు పరీక్షలు జరిగినయ్, రిజల్టు తప్పటమే!—కొన్నాళ్లకు ఇంటికొచ్చాను నేను. మాతండ్రి చనిపోయాడు. నేను రాగానే కుటుంబభారం అంతా పడింది నా నెత్తిమీద. ఆస్తి కాస్త నాచదువుకే అయిపోవడంచేత నేను దుర్భరదారిద్ర్య దేవతను ఎదుర్కున్నాను. అంతటితో అణిగింది అదరిపాటు. పశ్చాత్తాపపడ్డాను. మిక్కిలి. మాకుటుంబాన్ని పోషించటానికి నాకు సాధ్యం గావటంలేదు. తలప్రాణం తోకకువస్తోంది, "సంసారం దుఃఖంసాగరం తస్మాజ్జాగ్రత జాగ్రత" అనువిషయం నాకు

వివాహానికి పూర్వం తెలిసిందికాదు. తెలిస్తే వివాహం మానేశేవాణ్ణి. మఱచానను చెప్పటానికి,- 'ఇనుమునుగూడిన అగ్నికి సమ్మెటపెట్లన్నట్లు నాతోకలిసి తిరిగిన మిత్రులిద్దరుకూడా దురలవాట్ల పాలైపోయారు. చేసేదిలేక, కుటుంబపోషణార్థం బయలుదేరాను పాత్రనుదీసికొని భిక్షానికి, ఇదే నాఉదంత" అని ముగించాడు అతడు. అంతట మాకు జాలికలిగి, అతనికి తగువిధంగా సహాయంజేసి పంపించాం.

# జమీందారీల ఆదాయము

ఈ క్రింది పట్టిక వలన మన రాజధానిలోని ముఖ్యములైన జమీందారీలకు వచ్చు రివిన్యూలో ప్రభుత్వమువారి కెంత పేషకష్పు చెల్లింప బడుచున్నదో తెలియనగును.

| పేరు | 1931-32 వ సంవత్సరమునకు ఎస్టేటు రివిన్యూ | 1931-32 లో ప్రభుత్వమున కియ్యవలసిన పేషకష్పు |
|---|---|---|
| పర్లాకిమిడి | రు 4,98,400 | 79,788 |
| విజయనగరం | 20,16,269 | 4,94,816 |
| బొబ్బిలి | 6,12,313 | 83,453 |
| జయపూరు | 12,02,018 | 15,988 |
| పిఠాపురం | 5,97,930 | 2,62,782 |
| దేవైకోట | 2,81,170 | 79,495 |
| వెంకటగిరి | 11,68,353 | 3,68,734 |
| కార్వేటినగరం | 5,71,110 | 1,73,842 |
| కాళహస్తి | 5,82,550 | 1,72,982 |
| శివగంగ | 6,76,937 | 2,53,451 |
| రామనాడ్ | 11,69,705 | 2,92,627 |
| ఎట్టియపురము | 2,96,256 | 77,985 |
| ఇతర ఎస్టేటులు, | 1,26,30,585 | 26,36,005 |
| మొత్తము | 2,23,12,598 | 49,91,947 |

# గర్భవతి—చికిత్స

## విన్నపము

స్త్రీలు గర్భవతులయినప్పటినుండియు ప్రసవించి తిరిగి పూర్ణారోగ్యమునందు వరకును స్త్రీలను కాపాడెడు పద్ధతులు అనేకములు ఆంధ్రదేశమందలి గ్రామములలో కలవు. ఆపద్ధతులు, ఆగృహచికిత్సయుదియంతయు నేడు అంతమగుచుండుట శోచనీయము. ఈసందర్భమున చేయబడు కార్యకలాపము అనుసరింపబడెడు ఓషధీప్రయోగాది వివరములను సేకరింప తలపడితిని. అందువలన ఆంధ్రమహాశయులా వివరములను కొంత శ్రమతీసికొని నాకు పంపునెడల వందనములతో నందుకొనగలను. ఈదిగువ విలాసమునకు వ్రాయుడు:—డా॥ ఎస్. శేషగిరిరావు, 123 పూనమల్లిహైరోడ్, వేపేరి, మదరాసు.

# ఏరోప్లేన్

శ్రీ వింజమూరి శ్రీనివాసాచారి

మోటార్ సైకి లెక్కడం ఏరోప్లేన్లో మబ్బుల్లో మునిగిపోవడం, ఏ 'పి అండ్ ఓ.' స్టీమర్ మీదో నెలరోజులపాటు నడిసముద్రంలో ప్రయాణంచెయ్యడం ఇవీ నాకోరికల్లో ముఖ్యమైనవి. వెనకటికి నీరో అనే అతడు రోముదేశమంతా భగ్గున మండిపోతూంటే, ఆమంటలూ అవి చూసి ఆనందపడి ఫిడేలువాయిస్తూ కూర్చున్నాట్ట. ఇంచుమించూ ఇలాంటితత్వమే మనదికూడా. ఎప్పుడేనా ఏసినీమాకో వెళ్లడం తటస్థిస్తే, ఫిలింలో కథప్రకారం కొంతమంది ఏస్టీమర్ లోనో ప్రయాణం చేస్తూండగా అమావాస్యరాత్రి నడిసముద్రంలో మహాభయంకరమైన తుఫానొకటి బయలుదేరి ఆ స్టీమర్ని ముంచివేస్తే, దాన్తోపాటు అంతా మునిగిపోగా ఒకవ్యక్తిమట్టుకు ఏదో ఒక కొయ్యముక్క నాధారంచేసుకుని అర్ధరాత్రి ఆఅల్లకల్లోలపు మహాసముద్రంలో ఈదులాడుతూన్న సమయమున, అక్కడికి కొద్దిదూరంలో పోతూన్న ఇంకొకస్టీమర్ ఎలాగయితేం ఇతన్ని రక్షించిందనుకుందాం. ఇలాంటివి చూచినపుడు ప్రేక్షకుల హృదయాల్లో ఆవేదన, భయం, జాలి ఇత్యాది భావాలు స్ఫురిస్తాయ్. మనసంగతి అలాకాదండి సుమా. ఆహా! ఏమి ఆ దృశ్యము! ఏమియాసొగసు! నేనుకూడా వాళ్ళవలె ప్రయాణంచేయు భాగ్యము నాకు లేకపోయెనే! ఒంటరిగా నొక కొయ్యముక్క నాధరంచేసుకొని మహాసముద్రమున నర్ధరాత్రియందా భయంకరమైన తుఫానులో చావా బతుకా యను యవస్థయందున్న నామహానుభావు డెంత పుణ్యము చేసికొనినాడో కదా! నాహృదయం ఇలాంటిభావాలతో నాట్యమాడుతుంది-కోతలనుకున్నా సరే, ఉన్న సంగతిచెప్పాను. కష్టంలోసుఖం, దుఃఖంలో ఆనందం, చేదులో మాధుర్యం, వికృతంలో అందం, ఏడుపులో నవ్వు ఇలాంటివి అనుభవానికి తెచ్చుకొని పొందేటటువంటి ఆనందమే బ్రహ్మానందమనుకుంటూ.

సుమారు నాలుగైదు సంవత్సరాలవుతుంది. ఒకసారి ఏదోపనుండి మెడ్రాస్ వెళ్ళా. ఆవూరికి ఏరోప్లేను లొచ్చాయంటే ఒచ్చాయన్నారు. డబ్బిచ్చి ఎవరుబడితేవాళ్లెక్కచ్చు నన్నారు. రేట్లు రెండు రకాలు. పాతికరూపాయిలిస్తే పట్నమంతాచూపిస్తారనిన్నీ, పదిరూపాయలకు పట్నంలో కొంతభాగం మాత్రం చూపిస్తారన్నారు. ఈసంగతివిని నేనుపడిన ఆనందం ఇంతా అంతా అని చెప్పడానికే వీల్లేదు. ఇంకా నాలుగురోజులాగితే రేటు ఐదురూపాయలవుతుందన్నారు. రేట్లు తగ్గినతరువాత ఎక్కుదాం కదా అని కొన్నాళ్లు ఉపేక్షచేసా.

ఏరోప్లేన్సంగతి అనేకమంది అనేకమోస్తర్లుగా చెప్పుకోడం మొదలెట్టారు. నాటుకోటిచెట్టియార్ ఒకడు ఏరోప్లేనెక్కి సగందూరం వెళ్లేసరికి కళ్లు తిరగడంవల్ల, "బాబూ నాప్రాణం పోయేట్టుంది, నన్ను దింపెయ్యండి వెయ్యిరూపాయలిస్తాను మొర్రో" అని యెంతఏడ్చి బతిమాలుకున్నాగూడా అతన్నిదింపక ఇంకా కొంతపైకి తీసుకువెళ్లేటప్పటికి పాపం శెట్టియార్ గారిగుండెకాయకొట్టుకొనడంమానేసిందట. ఇంకొక విచిత్రసంగతివిన్నారా? దాన్లోకూర్చొని ఎగిరేవాళ్ళ రెండుకళ్లకీ గంతలు కట్టేస్తారన్నారు కళ్లు తిరుగుతాయేమోనని. ఏడ్చినట్టేఉంది. అదేగనక నిజమైతె ఏమోటార్ బస్లోనో ప్రయాణం చేసేటప్పుడుకళ్ళు రెండూమూసుకొనిఏరోప్లేన్లోనే వెళ్తున్నామని అనుకోడం ఇంకా సులువుగాఉంటుందిగా. మరిచిపోయినా-ఎక్కడో ఒక ఏరోప్లేను ప్రమాదవశాత్తు కిందకి కూలిందనిన్నీ, అందులో ప్రయాణంచేస్తూన్న ఇద్దరు మనుష్యులమాంసలు రెండూ అమాంతగా లేచిపోయి స్వర్గానికిచేరాయనిన్నీ పేపర్లో వేయడం చూశా.

ఇలాంటి కబుర్లు విన్నమీదట ఇంకోళ్లైతే అదిరిపోయేవారే. నాలోనేను ఇలా అనుకున్నా: మనం పుట్టింది చావడానికే. ఆచావనేది ఎప్పుడొస్తుందో ఎవరూ చెప్పలేరు. మనం ఒకడ్ని చంపాలని ఎంత ప్రయత్నించినా మనచేతిలో వాడికాచావు రాసిఉండకాని వాడు చావడు. ఇంతకీ విధి ఎలాఉంటుందో

అలాజరుగుతుంది. ఎంతమంది చావడంలేదూ? ఊరా? పేరా? ఇంకా ఏరోప్లేన్‌లోంచి పడిచచ్చినా కాస్త పేరైనా ఉంటుంది. "Airoplane crash Mr. Chari of Guntur one of the victims" అని మనపేరు పెద్ద అక్షరాలతో తప్పకుండా పేపరికెక్కుతుంది. అంతే చాలుననుకున్నా మనస్సులో. మద్రాస్‌లో చదువుతూన్న మాబంధువు వెంకటాచారిగారి మనస్సు కెక్కించా పైతత్వమంతా. చచ్చినా బతికినా ఏదో నాకు ఇంకోడు తోడుంటాడుగదా అని నాగోల. ఆఖరికి ఇద్దరం ఏరోప్లేన్ ఎక్కుదామంటే ఎక్కుదా మనుకున్నాం.

ఏరోప్లేన్ రేటుకూడా ఐదురూపాయలకు తగ్గించారన్నారు. సరే, మర్నాడుపొద్దున్నే ఆరుగంటలకి ఇద్దరం మైలాపూర్ బస్ ఎక్కి మవుంట్ రోడ్‌లో దిగాం. కాఫీహోటల్లో ఇడ్లీసాంబార్ మెక్కి తీర్చుకొని మీనంబాకానికి వెళ్లే బస్సెక్కాం. ఆకాశమంతా మబ్బుట్టింది. చల్లటిగాలి. బహు ఆనందంగాఉంది ఆరోజు బస్ కదిలిన కాస్సేపటికి ఒక అరవ సోదరుడు, "ఏమియ్యా, ఏరోప్లేన్ ఎక్కిపూడుస్తువా?" అని ప్రశ్నించాడు అరవతెనుగుతో. అవునని జవాబిచ్చా, "ఎందుకప్పా, చచ్చిపూడుస్తువే" అని అన్నాడు. శుభమా అని ఏరోప్లేన్ ఎక్కబోతూంటే, వీడిమొహం తగలెయ్యా, ఇలా అంటాడేంరా యనిబలే కోపమొచ్చింది. చెప్పద్దూ, ఒళ్లు మండి ఒక్కటిద్దామనుకున్నా. అంతపనీచేసేవాడ్నే కాని మళ్లీ ఏం మాట్లాడలా మానవుడు. ఒకవేళ మళ్ళీమాట్లాడితే— సందేహ మెందుకండీ మెడకాయ ఘటామనిపోయిందే. ఇంతకీ వా డదృష్టవంతుడనుకున్నా. సుమారు ఒక అరగంటప్రయాణం చేసేటప్పటికి దూరంగా రోడ్డుకుపక్కగా ఒకపెద్దగుంపు కనబడింది. ఆదే ఏరోప్లేన్ ఎక్కేచోటన్నాడు బస్సులో ఒకడు.

ఏరోప్లేన్ కనబడగానే నాకు ప్రాణాలు లేచొచ్చాయి. పెద్దమైదానం. అందులో రెండుఫర్లాంగులు దూరంగా ఏరోప్లేనొకటి కనబడుతూంది. రోడ్డు పక్కే నాలుగైదు గజాల్లోఉంది ఇంకొకఏరోప్లేన్ దానిమీదేదో G. E. BUM అని పెద్దఅక్షరాలతో రాసిఉంది. దాన్ని నడిపేవాడిల్లాగున్నాడు. ఒకదొర స్టూల్‌మీద కూర్చొని ఒకకుంచెతో ఏరోప్లేన్‌కేదో తెల్లటిరంగుపూస్తున్నాడు. వాడిచుట్టూ మూగి చూస్తున్నారు కొందరు. అక్కడికి నాలుగు బారలదూరంలో చిన్నడేరా ఒకటివేసుంది, అది పైలెట్లుండేందుకు ఏర్పడ్డ డేరా అన్నారు. అక్కడే ఒక చెట్టుకింద కొన్ని వెత్తైలపాక్ (కిల్లీ)దుకాణాలు కూడా ఉన్నాయి.

బస్సు దిగ్గానే చేతిలో కుంచీవాడూ ఆదొర మావి ఏరోప్లేన్ ఎక్కే మొహాలని కనిపెట్టినట్టున్నాడు. మాదగ్గరకొచ్చి "Hallo! Good Morning, Have you come to fly?" అన్నాడు. ఇద్దరం ఒక్కసారిగా అవునని జవాబిచ్చాం ఎంతో ఉత్సాహంగా. వెంటనే వాడు "Hallo pilot. Here are two gentlemen ready to fly" అని డేరాలో కాఫీతాగుతూన్న రెండవ పైలెట్‌కి బాగా వినబడేట్టు అరిచిచెప్పాడు. మైదానంలో దూరంగాఉన్న ఏరోప్లేన్‌నడిపేవాడే కాఫీదొర. పొద్దున్నపూట కాఫీదొర ప్లేన్‌ఎగిరితే సాయంత్రం మన కుంచిదొర దెగురుతుంది. ఇలాఉంది ఏర్పాటు. "సార్, రేట్లసంగతి కొంచెం చెప్పండి" అని అడిగాను కుంచిదొరని. "పాతికరూపాయలూ, పదిరూపాయలూ" అని జవాబిచ్చాడు.

టికెట్టురేటు ఐదురూపాయలకు తగ్గించారుకదా అని సరీగ్గా ఐదురూపాయలే తెచ్చుకున్నా నేను. వెంకటాచారిగారి దగ్గరమట్టుకు పదిరూపాయల నోటొకటుంది. సరే ఏంచెయ్యడానికి తోచలా. ఇద్దరి దగ్గరకలిపి పదిహేనురూపాయిలే ఉన్నాయి. ఉత్సాహమంతా ఒక్కసారిచచ్చింది. ఎలాగంటే ఎలాగనుకున్నాం. డబ్బు చాలకపోవడంవల్ల ఏం చెయ్యడానికి తోచలేదు, వెంకటాచారి తాను తెచ్చుకున్నడబ్బు నాచేతిలో పడేసి, "మీ రెక్కండిసార్ పాపం, ఎప్పుడూ మద్రాస్‌లో ఉండేవాడ్ని నాకేం కష్టం నేనెపుడుపడితే అపుడెక్కుతా" అన్నాడు. అతని వైఖరిచూస్తే తీరా ఆఏరోప్లేన్ అదీచూసేటప్పటికి కొంచెం ఫికర్ పుట్టినట్టుంది. అందుకే నన్నెక్కమని బలవంతం చెయ్యడం. నిజంగా అతనికేగనక ఎక్కాలని ఉత్సాహముంటే తనదగ్గర డబ్బున్నా కూడా 5 రూపాయలూ నాకప్పిచ్చినన్నే ఎక్కమని బలవంతం చేయడ మెందుకంట. ఇదుగో చూడండి చెప్పద్దూ. లోపలమట్టుకు నాకే ఎక్కాలనుంది. ఏదో మొహమాటమొక టేడ్చిందిగా. అందుకోసం

ఇలా అన్నా "పదిరూపాయిలు తెచ్చుకొనికూడా పాపం మీ రెక్కలేక పోవడం ఏమిటిసార్? ఇద్దరం జతగావచ్చినపుడు ఇద్దరంఎక్కడం న్యాయంగాని, ఇదేమిటండిసార్ నన్నెక్కమంటారూ?" అన్నా పైకిమట్టుకు "పరవాలేదు మీరే ఎక్కండిసార్," అని మళ్ళీ ఇంకొకసారి అంటాడేమో ఛాన్సుపోగొట్టుగోకూడ దనుకున్నా. మళ్ళీ కొంచెం ప్రెస్ చేసాడు. ఇక 'ఒబ్లైజ్' చెయ్యకపోతే మర్యాదగాఉండ దనుకున్నా. సరే నేనే ఎక్కడం అని తేలిపోయింది.

ఇంతలో ఎవరెవరో ఒక దొరా దొరసాని, దివ్యజ్ఞానంలోన్చి తొడుక్కున్నాడు ఇంకొకడూ, వీళ్ళుముగ్గురూ పైలెట్ తో, "ఏరోప్లేన్‌మీద అడయార్ చూపించడానికేం పుచ్చుకుంటారు," అని అడిగారు. మూడుపాతికలు డబ్భైయైదురూపాయలన్నాడు కంచిదొర. ఇంతేగదా అన్నటు ముగ్గురు మూడు టిక్కెట్లు పుచ్చుకున్నారు. కాఫీదొర వారిని వెంటబెట్టుకొని మైదానంలోవున్న ఏరోప్లేన్‌లో కూర్చోబెట్టాడు. కాసేపట్లో ఏరోప్లేన్ మానెత్తిమీంచే ఎగిరిపోయింది. దానిమీదగూడా G. E. BUM అనే రాసిఉంది. సుమారు రెండుతాడిచెట్ల ప్రమాణంలో ఎగురుతోంది. అక్బే ఇదేం ఎగరడం? ఏరోప్లేన్ ఎక్కాం, ఒకమేడఎత్తున ఎగిరాం అంటే పిచ్చగాలేదూ? ఏరోప్లేన్ ఎక్కడమంటే ఏమైలో రెండుమైళ్ళో మబ్బుల్లోకెళ్తే స్వారస్యంగా ఉంటుందిగాని ఇదేమిటి! అంతకాడికి ఏరోప్లేన్ ఎక్కడమెందుకూ? ఏదేనా ఒకమేడమీదికెక్కి సంతోషపడవచ్చుగా. ఈసందర్భం చూసేసరికి నాఉత్సాహమంతా సహించచ్చింది. సరే సుమారు ఇరవైనిమిషాల్లో మళ్లీ ఏరోప్లేన్ మైదానంలోవాలింది. 75 రూపాయిలూ తగలేసి ఏరోప్లేన్‌లో పొందదగిన ఆనందం వీళ్లు పొందలేకపోయినారు కదా పాపం అనుకున్నా నాలో నేను.

ఇంకేం నేనుకూడా పదిరూపాయిలిచ్చి టికెట్టు పుచ్చుకున్నా. సీట్లన్నీ భర్తీఐతేగాని ఏరోప్లేన్ బయలుదేరదన్నారు. ఏరోప్లేన్ ఎక్కేవాళ్లు ఇంకా యిద్దరుంటేగాని వీల్లేదట. సరే ఈలోపల కొంచెం దుకాణంలో ఏమన్నా కొందామనివెళ్లా. ఒకపొడుం పొట్లం కొంటిని. ఏరోప్లేన్‌లో జ్ఞానచూర్ణంవాడితే ఎలాఉంటుందోనని కొంచెం నస్యం అభ్యాసంలెండి. ఈసందర్భంలో ఒహ చిన్నవిషయం మనవిచేస్తా. ఇప్పుడు కాఫీసంగతి కొంచెం ఆలోచించండి. దాన్ని పొద్దున్నతాగితే ఒకరుచి. సాయంత్రంతాగితే ఇంకోమాదిరి. యిత్తడిటంబ్లర్లో పుచ్చుకుంటే అదొకమాదిరి. పింగాణీగ్లాసులో పుచ్చుకుంటే మరొకమాధుర్యం. మీరెప్పుడేనా పరీక్షచేశారో లేదో. కాబట్టి ఏపదార్థమైనాసరే స్థలాన్నిపట్టీ, వేళనుపట్టీ, మనస్సునుబట్టీ రుచి భేదిస్తూ ఉంటుంది. ఇలాంటిది అనుభవంగా తెలుసుకోడానికే నస్యం కొన్నాను.

దుకాణబేరం కాగానే మళ్ళీ డేరాదగ్గర
చ్చాను. ఈలోపల ఎవరో మళయాలదేశస్థులట భార్యాభర్తలు పదిరూపాయలటికెట్లు రెండుపుచ్చుకొన్నారు. కాఫీదొర మాముగ్గురిని మైదానంలోనున్న ఏరోప్లేన్‌దగ్గరకు తనవెంట రమ్మన్నాడు. సరే మేం ముగ్గురం వాడివెంట బయలుదేరాం. యిహ ఏరోప్లేన్‌లో బాగా పైకెగరడానికుపాయమేమిటాఅని ఆలోచించా. ఆఖరికి ఒకఉపాయంతోచింది. దొరకి ఒక చిన్నమస్కా వేశా. వాడితో అన్నానూ, "సార్! 250 మైళ్ల దూరంనుంచి పాతికరూపాయిలు ఖర్చుచేసుకొని, కేవలం మీఏరోప్లేన్ ఎక్కడానికే ఈవూరుకొచ్చా. సైన్సువిద్యార్థిని కావడంచేత ఏరోప్లేన్ ఎలా ఎగురుతుందో ఏమిటో అనుభవంగా తెలుసుకోడానికే ఇంతదూరం వచ్చాను. పట్ణమంతా చూపించినాసరే చూపించకపోయినాసరే కాని, నన్నుమాత్రం మబ్బుల్లోకి తీసికెళ్ళమని రిక్వెస్టుచేసా. మనంవేసిన మస్కా దొరగారికి గట్టిగా అతికింది. ఎండకి మైనంకరిగినట్టు కరిగింది అతనిగుండె. దొర నాకు జబాబిచ్చాడూ, "బాగా పైకివెళ్లడానికి కొంచెం టైం పుచ్చుకుంటుందేమో అని సందేహించాను. పదిరూపాయలకు పది నిమిషాలే వ్యవధి వుంటుందే! ఐనాపరవాలేదు, ప్రయత్నించిచూస్తా" అన్నాడు పాపం నవ్వుతో. అతని జవాబుకు అమిత సంతోషించా.

దొరలేమిటంటే, మనదేశానికొచ్చినతర్వాత మన వాళ్ళు వంగి సలాములుచెయ్యడం అదిచూసి వీళ్లు వుత్తిబానిసవెధవలని వాళ్లు అనుకోవడం, అక్కడినుంచి మన్ని వాళ్ళు హీనతతోచూడడం జరుగుతోంది, నిజానికి నన్నడిగితే వాళ్లహృదయాలు అమృతంవంటివని బల్లగుద్ది చెప్తా.

మేమెక్కవలసిన ఏరోప్లేన్‌దగ్గరకెళ్లాం. తలా, తోకా, రెక్కలూ అంతా ఒకపిట్ట ఆకారంగా

వుందండీ. పైలెట్టుతోసహా నలుగురుకన్నా ఎక్కువ అందులో కూర్చోడానికి వీల్లేదు. సీట్లపైన కాకిబంగారం కిటికీలతో అమర్చబడ్డ ఒక సినారేకుమూత వుంటే దానిని పైకెత్తారు. ఏరోప్లేన్‌కు ఆనించివుంది ఒక ఇనపనిచ్చెన. మాముగ్గురిని ఆనిచ్చెనమీంచిఎక్కి ఏరోప్లేన్‌లో కూర్చోమనెను. మొట్టమొదట ఆమళయాలంస్త్రీ నెమ్మదిగాఎక్కి ఏరోప్లేన్‌కు వెనకభాగంలోవున్న సీటులోకూర్చుంది తరవాత ఆమెభర్త, నిచ్చెన సహాన్ని పాకడం-అక్కడినుంచి కాళ్ళు గడగడ వణకడం-గుమ్మడికాయ పడ్డట్టు ధనా మని కింద పడడం-అదొక పెద్దపార్సు, నవ్వలేకచచ్చాం. సరే ఆఖరికెలాగైతేనేం పాపం భార్యకెదురుగా ఇవతల సీటులో కూర్చున్నాడు. ఇహ నేనూ పైలెట్‌సీటు నానుకోనేవుంది ఇవతలొకసీటు అందులోకూర్చున్నా పైలెట్ కూర్చున్న భాగంవేరు. మేముకూర్చున్న భాగంవేరు. మాకూ పైలెట్‌కూ మధ్య కొయ్యతో చేసిన ఒక 'స్క్రీన్' వుంది. వాడు మాకు కనబడడు, మేమువాడికి కనబడం, పైలెట్ సీటు వెనకసీటులోనే నేను కూర్చున్నా. స్క్రీను మాయిద్దరిసీట్ల మధ్యవుండడంచేత ఇద్దరం చెరొకవీపు ఆస్క్రీను నానుకొని కూర్చున్నాం. ఇదంతాఏందుకూ? మాఇద్దరివీపులకు ఆస్క్రీనే అడ్డం. మూత మళ్ళీ యథాప్రకారంగా వేసేశారు. మాముగ్గిరితలకాయలమీదా మూడుయిత్తడిగొలుసులు వేళ్ళాడుతూవున్నయి. నాసీటుకిఇటూ అటూ వున్న కాకిబంగారం కిటికీలలో ఒకటిమట్టుకు పూర్తిగా ఊడిపోయి ఒక కంతయేర్పడింది. ఇలావుంది ఏర్పాటంతాను. కంతలో తలకాయదూర్చి చూడడానికి మహాబాగావుందని సంతోషించా. మొట్టమొదట ఏరోప్లేన్‌కు ముందుభాగంలోవుండు పొడుగాటి రేకు నొకదానిని ఇద్దరుమనుష్యులు రెండుమూడుసార్లు చేతులతోతిప్పేరు. ఇంజన్‌పనిచెయ్యడం ఆరంభించిది, రేకు గిర్రున దానంతటదే తిరగడంమొదలెట్టింది. కాస్సేపట్లోదానికి చలనంకలిగింది. ఏరోప్లేన్‌కు అడుగుభాగంలోవుండు రెండుచక్రాలమీద మోటార్‌పోయినట్టు రెండుమూడుఫర్లాంగులు వాయువేగంతో నేలమీదనడిచి క్రమేణా పైకిలేచింది. పోయింది యింకాపోయింది. సుమారు రెండుమూడు ఫర్లాంగులఎత్తున ఎగురుతోంది, సరే ఈలోపల మాడవలసిన చిత్రాలన్నీ చూడాలిగామరి! ఏరోప్లేన్ నొకటి పైనుంచిపోతూంటే సాధారణంగా మనం దిగాలపడి పైకిచూచినట్లు, పైకిమాడడం కనిపించింది మనుష్యులు మరి గుజ్జల్లాగ కనబడుతున్నారు. మేడలూ, మిద్దెలూ, చెట్లూ, చామలూ అన్నీ అమితవేగంతో పరిగెట్టుతున్నయి. ఒకపక్క సముద్రం కనిపిస్తూంది. హార్బరు మాఇంటి దొడ్డిఅంతుంది. మోటార్లు, ట్రాములు, నడవడంచూస్తే నేలమీదచీమల పాకుతుంటే ఎలావుంటుందో అలావుంది. సెంట్రల్ స్టేషను పక్కనున్న రైల్వేకంపెనీ వారిమేడంతాకలిసి మావూళ్లో నార్తుక్లబ్బంతకూడాలేదు. అన్నీ ఇలాగే. తమాషాగా వున్నాయి.

ఇలావుండగా ఏదో ఊరుకోగూడదూ, ఆకంతలోంచి చెయ్యిచాచి చూచా. బాబూ ఇహేంచెప్పనూ, మళ్ళీచేతిని లోపలికి లాక్కోడానికి బ్రహ్మరుద్రులు దిగొచ్చారు. చెయ్యి విరిగిపోయిందనుకున్నా అంతజోరుగావుంది గాలి. ఇంకా నయం తలకాయేకంతలోదూర్చి చూసుందునూ, ఇంకెందుకూ తలవెంట్రుకలన్నీకూడా ఒక్కపట్టున ఎగిరిపోయి అంబష్టుడి సహాయంలేకుండానే పరిశుభ్రమైన తిరుక్షవరం జరిగేదన్నమాటే. సునాయాసంగా బాల్డ్‌హెడ్ అంతవాడవడానికవకాశముండేదే! ఒకవేళ అలాజరిగుండి ఏరోప్లేన్‌దిగ్గానే ప్రేక్షకుల్లో ఎవరైనా, "ఏమండి సార్, ఇందాక ఏరోప్లేనెక్కకమునుపు బాగా క్రాపింగుంటే, ఇప్పుడీ యేర్పాటేమిటండీ," అని ప్రశ్నించడం జరిగినట్టయితే, "ఏమోనండిసార్, ఏరోప్లేనంటే అంతాభయపడతారుగాని, నాకుమటుకు అందులో ప్రయాణం చెయ్యడమంటే కేవలం మంచినీళ్ళప్రాయంగావుంటుంది. ఏరోప్లేన్‌లో ప్రయాణంచేస్తూనే సెల్ఫ్‌షేవింగ్ ట్రైచేసానని రెండుడాబులు డాబి సమర్థించుకోపోయునానూ? ప్రేక్షకులుకూడా నా ధైర్యస్థైర్యాలకు దంగ్ కాక పోయునారా? ఏరోప్లేన్ వెళ్తూనేవుంది. ఎంతహాయిగా వుందండీఅందులో. కళ్ళుతిరగడం ఒళ్ళుతిరగడం అలాంటిపదార్థాలు మనవిషయంలో ఏం మాట్లాడకూడదన్నమాట. నేనే నా యింతధైర్యస్థుడను, లేక నాతోపాటు ప్రయాణంచేస్తూన్న మన మళయాళ దంపతులుకూడా నాకుమల్లె ధైర్యంగావున్నారా అని ఒక్కసారికాళ్లకేసి చూశా. వాళ్ళుకూడా ధైర్యంగానే కూర్చున్నట్టు కనిపించింది. తలవెంట్రుకలు సవిరించుకుంటూ బహుసంసారపక్షంగా కూర్చుందిఆవిడ. స్త్రీఐనా ఏంధైర్యంరా అనుకొన్నా నాలోనేను.

ఏరోప్లేన్‌లో కళ్ళు తిరుగుతాయన్నారు. గాని ఎందుకు తిరుగుతాయండీ. చూశారూ, కళ్ళుతిరగడం ఎప్పుడు జరుగుతుందంటే, ఇప్పుడు హైకోర్టులైట్ హావుస్ వుందనుకోండి. అక్కడినుండి కిందకిచూస్తే కళ్ళు తప్పకుండా తిరుగుతాయి. దానికొక కారణముంది. మన ముండు ప్రదేశం భూమికి ఎంతఎత్తులో వుందో మనస్సుకు బాగా బోధకావాలి. తరువాత "ఈప్రదేశంనుంచి మనం కిందపడితే అనేతలంపు మనస్సుకు తోచినపుడు భయం పుట్టి కళ్లుతిరగడం అలాంటివి ఏర్పాటవుతాయి. ఏరోప్లేన్ అంటారా అలా కాదు. ఆకాశమార్గాన అమితవేగంగా పోవుటవల్ల మనకు కనబడేవస్తువులుకూడా అమితవేగంగా పరిగెట్టుతున్నట్టు కనిపిస్తుంది. ఏరోప్లేన్‌కీ చలనముండడంవల్లనూ, కింద కనబడే వస్తువులుకూడా పరిగెట్టుతున్నట్టు మనస్సుకు ఒకభ్రమ కలుగడంచేతనూ ఏరోప్లేన్‌కీ భూమికీవుండుదూరం మనస్సు సరిగాగ్రహించాని కవకాశం ఏమాత్రముండదు. కళ్ళుతిరగకపోవడానికి ఇదే కారణమనుకుంటా. మొన్నీమధ్య ఆనిబిసెంటు లండన్‌నుంచి బెర్లిన్‌కు ఏరోప్లేనులో ఎగిరి వెళ్ళిందంటే నాకమితఆశ్చర్యం కలిగింది. ఇపుడిటువంటి ప్రయాణం అనుభవంగా తెలుసుకోవడంవల్ల బిశెంటమ్మ ఏరోప్లేన్ కావడంవల్లే అంతదూరప్రయాణం చేయగలిగిందని అనుకోవాల్సొస్తుంది. ఇంకా రైల్లోనేనా కుదుపుంటుంది కాని ఏరోప్లేన్‌లో మటుకు అలాంటిదేమాత్రం లేదు. చాలాసౌఖ్యంగా వుంది.

ఇంతలో అనాసకాయపైన వుండే ముళ్లగుత్తిమాదిరిగావుంది ఏదో ఒక భయంకరఆకారం, కంతలోంచి నెమ్మదిగా లోపలికిప్రవేశించి నావీపును తీవ్రంగా చరచడం మొదలెట్టింది. ఇదిచూసి హడిలిపోయినాను. మనమెన్నడూ చూడని ఆకాశంలో నుండే ఒక భయంకరపురుగేమో ననుకుంటి. కొంచెం శాంతించిచూశాను. పురుగూకాదూ బండలూకాదూ మన కాఫీదొరగారు చేతులకదేదో తొడుక్కొని ఏరోప్లేన్ పక్కగుండా తనచేతిని ఆకంతలో ప్రవేశపెట్టి నావీపుని చావమోత్తున్నాడు. వీడి దుంపతెగా యిదేమిటి అనిచెప్పి ఆశ్చర్యపోయినా, ఒకవేళ కొంపదీసి మహాద్రావకంబాపతు ఏదేనా పనిచేసి నిషాలో ఈపని చేస్తున్నాడేమోనని అదిరిపోయినా. అదురుకాదండీ మరీ? భూమికి సుమారు ఐదుఫర్లాంగులదూరంలో, ఏరోప్లేన్‌లోపట్టుకొని నన్ను బాదుతూంటే ఎలావుంటుంది చెప్పండి? వెనక్కితిరిగిచూసా స్క్రీనుకి ఒక బెత్తెడుమేర ఒకరంధ్రం దానికొక కాకిబంగారం తొడుగు కనిపించింది. అందులోంచి చూశా. పైలెట్టుకూర్చున్న భాగమంతా చక్కగా కనిపిస్తూంది. దొర నేనుచూడడంగ్రహించి తనచేతిని మళ్ళీ తానులాక్కొని ఏదో గడియారంలాగవుండ వుంది దానిముల్లును వేలుపెట్టి నాకు చూపిస్తున్నాడు ముల్లు మూడుమీదికొచ్చింది. "Three?" అన్నా. "yes" అని మళ్లీ బదులుపల్కేడు. నేనడిగింది వాడికి తెలియడం, వాడనెడిముక్కలు నేను తెలుసుకోడం కేవలం పెదవుల కదలికవల్ల జరిగిందిగాని ఇంకోవిధంగా కాదు. ఏరోప్లేన్ చేసే ఆరోదనధ్వనిలో యింకెటువంటి ధ్వనైనా మునిగిపోవాలనెడిమాటే. అదంతాఎందుకూ కాసేపు ఏరోప్లేన్‌లో కులాసాగా పాడుకుందామని గొంతెత్తేసరికి నాగొంతేనాకు వినబడలేదూ. అందుకనే అందులో మనమేదైనా సంభాషించుకోవాలంటే వ్రాతపూర్వకంగాగాని, సంజ్ఞసహాయంతోగాని జరగవలసిందే. అబ్బ అందులో ధ్వనిమటుకు గూబ గుఁయ్ అనేట్టుంది.

సరే, ఏరోప్లేన్ కిందికి దిగడానికి టైంమైపోవడంవల్ల కాబోలు అంతవేగంగా పోతూన్న ఆఏరోప్లేనుని హఠాత్తుగా మైదానంవైపుకు తిప్పాడు. గంటకు పదిమైళ్ళవేగంతో పోతూవుండు మోటారుబస్సు కొంచెం మలుపుకుతిరిగితేనే అందులోవుండే జనం ఒరిగి వకళ్లమీదవకళ్ళు పడుతుంటారు. యిహ వాయువేగంతో పోతూవుండు ఏరోప్లేనుహటాత్తుగా ఒకవేపుకు తిరగడమంటే ఇహ చెప్పేదేముందీ. ఏరోప్లేన్ చెడిపోయి కిందపడి పోతూందనుకుంటిని. ఏదీతోచక పైనవేళ్లాతూవుండు గొలుసుని గట్టిగా లంకించుకుంటిని. ఎక్కాముురా పేపరికి అనుకుంటిని. నాకు తెలీకుండానే కన్నీళ్లు బొటబొట కారుతుంది. బంధువులూ, స్నేహితులూ, అంతా ఒక్కసారిగా జ్ఞాపకానికొచ్చారు. "ఎరక్కపోయొచ్చారా బాబూ!" అని కొంచెం ఎక్కిఎక్కి ఏడ్చినట్టుగూడా జ్ఞాపకం. మరణవేదాంతం మళ్ళీ స్మరణతెచ్చుకున్నా కొంచెం ధైర్యంచిక్కింది. ఇంతధైర్యంగా ఏరోప్లేనెక్కి చచ్చినవాళ్లకి వీరస్వర్గం తప్పదనుకుంటి. "స్వామీ! తండ్రీ! రక్షకా! నన్ను మళ్ళీ భూమిమీద ప్రాణంతో వదిలిపెడితే తప్పకుండా వెయ్యి

బిందెల పానకం చేయిస్తా''నని మంగళగిరిలో వెంచేసి
వుండే శ్రీపానకాలరాయడుస్వామికి మెక్కుకుంటి
కళ్ళు రెండూ మూసుకొని. యింతలో ఎలాగైతేనేం
ఏరోప్లేన్కు కొంచెం స్తిమితంచిక్కి మామూలుప్ర
కారంగా నడవడం మొదలెట్టింది. అమ్మయ్య, బతి
కాంరా బాబూ అనుకుంటి. ఇది అధైర్యపడిఏడ్చిన
మొహమని ఎవరూ గుర్తించకుండా వుండడానికి చేతి
రుమాలతో కళ్ళూమొహం బాగా తుడుచుకొంటి.
మరొక్కనిమిషంలో రివ్వునొచ్చి మైదానంమీద
వాలింది ఏరోప్లేను. ఏరోప్లేన్ మూత పైకెత్తారు.
అంతా నిచ్చెనమీద కిందికిదిగారు. నేనుమటుకు సరా
సరి పైలెట్టుదగ్గిరకెళ్ళి, గడియారంముల్లు మూడు
మీదికిరావడమంటే అర్థమేమని అడిగాను "అదిఎత్తు
గుర్తించేయంత్రం. ఒకటంటే 1000 అడుగులఎత్తు.
అప్పుడు మనఏరోప్లేను 3000 అడుగులఎత్తున ఎగిరింది
నీకు తృప్తిఐందా'' అని అడిగాడు. ఇందాక ఏరో
ప్లేన్లో నావీపుమీదకొట్టడం అదీ, నేను మొదట
కోరినప్రకారం నన్ను చాలాపైకి తీసికెళ్లానని చెప్ప
డం కాబోలు. పాపం చూశారూ వాడిహృదయం?

ఏరోప్లే నేగరడమ్మై పోయింది. నన్ను మావాడు
గట్టిగా కావిలించుకొని, "యిదిగో బ్రదర్, యిందాక
ఆ దివ్యజ్ఞానం వాళ్లే మెగిరారుకాని మీరుమటుకు
మబ్బుల్లో కెళ్లా''రన్నాడు. పైలెట్టుని స్పెషల్గా
రిక్వెస్టుచేయడంచేత అంతపైకి వెళ్ళగలిగామని నా
ప్రయాణ అనుభవమంతా—ఏరోప్లేన్లో కళ్లనీళ్ళు
పెట్టుకున్న భాగంమటుకు జాగ్రత్తగా ఒమిట్ చేసి--
మిగిలినభాగమంతాకూడా మీకుచెప్పినట్టే అతనికి
కూడా చెప్పాను. అదేమోకాని సాధారణంగా
యిలాంటి ఘనకార్యాలేవేనా చేసినప్పుడు పదిమంది
కీచెప్పుకుంటేగాని మనస్సుకి తృప్తివుండదండీ, బస్సు
లో పదిమందికీ వినబడేట్టు ఏరోప్లేన్సంగతి మా
వాడికిచెప్పడం. లేకపోతే ఎవరేనా పెద్దమనిషి కన
బడితే "ఏమండోయ్! మిమ్మల్ని నెక్కడో చూచి
నట్టుందే, బహుశా ఏరోప్లేన్దగ్గిర చూసుంటా''నన
డం, అక్కడినుంచి ఆపెద్దమనిషి మీరేరోప్లేనెక్కా
రా అని అడగడం, అలా అడగకపోతే మాడడం.
అడిగితే మనసంగతికొంచెం చెప్పుకోవడం యిలా
అనేకమోస్తర్లుగా అనేకమందికి ఏరోప్లేనెక్కానని
చెప్పుకునేదాక తోచిందికాదు. నిజానికి ఏరోప్లే
నెక్కడమంటే గొప్పసంగతి కాదండీమరి? ఎలా
గయితే ఏం కాసేపటికి ఇల్లుచేరాం. లోపలికిప్రవే
శిస్తూనే మావాళ్లతో ఏరోప్లే నెక్కొచ్చానని గట్టిగా
చెప్పా. మావాళ్ళింట్లో పాచిపనిచేసే పొన్నమ్మ
యిది విని, "మేమూ ఏరోప్లేన్ఎక్కి పూడ్చినాంలే
సామీ''అని బాగామాడ్చింది. ఆక్షణం మొదలుకొని
ఇహ ఎవరితోనూ ఏరోప్లేన్సంగతి చెప్పకూడదని
నిశ్చయం చేసుకుంటిని.

# ఉన్మాదులగు కోటీసులు

## బెర్నార్డుషా ఖండనము

జార్జి బెర్నార్డ్‌షా అను ఆంగ్లనాటక గ్రంథకర్త ఇంగ్లాండులో నుండుట మీకెల్లరికి తెలిసియే యుండును. ఆతనివాక్యములన్నియు భావగర్భితములుగను, తెలివిగలవిగను యుండును. అర్థశాస్త్రమునుగురించి షాగారు యిటీవల అమెరికాలో నొక ఉపన్యాససందర్భమున నిట్లనిరి.—

యుద్ధానంతరం నిపుణులగు కోశాధ్యక్షులు కావించిన రాజకీయసలహాలన్నియు విపరీతావస్థకు లోనగుట మీకెల్లరకు విదితమే. కోశాధ్యక్షులలో చాల తెలివిగలవాడు మాంటెగునార్మెన్ ఇంగ్లాండుబ్యాంకుకు సంబంధించినవాడు అర్థికప్రశ్నను గురించిన సత్యమును ఆతడు "నాకయ్యది బోధపడదు" అను ఒక్కవాక్యములో నిమిడ్చెను. యిందాశ్చర్యమేమున్నది? ఎందుకనగా ఆర్థికవ్యవహారమను నొక ప్రశ్నయే లేదు. ధనము యెప్పుడున్నట్లే యున్నది. ఇకమీదగూడ నట్లేయుండును.

ఆర్థికవ్యాసముల పత్రికలలో మీరు చదివెడుపక్షమున ఒకవిషయమును గమనింతురు. ఒకదేశముయొక్క అభ్యుదయమును, ఆదేశము విదేశములకు ఎగుమతిజేసి పొందుధనముచే పరిగణించెదరు. దిగుమతికన్న ఎగుమతి చాల అధికముగా నుండవలయుననియే నిపుణులగు కోశాధ్యక్షులెల్లరు యువ్విళ్లూరుచున్నారు. ధనమునుబట్టి యోచించువారికిది క్రమమనిపించును. కాని సరకులనుబట్టి యోచించువారికది నిరర్థకమనిపించును.

విదేశవ్యాపారమనగా ధనసహాయముతో సాగించు సరకు మారకపు బేరము. అధిక సరకులనంపి యెంతకెంత తక్కువగా సరకులను తీసికొనెదమో అంతకంతకు దేశమభివృద్ధి జెందునను వారలకు తగినస్థలము ఉన్మాద శరణాలయమే. అయితే యింగ్లాండులోను అమెరికాలోను యిట్లు జెప్పువారలకే మాత్రాంగమునందు స్థలముండును.


(జార్జి బెర్నార్డుషా)


కోశాధ్యక్షులు ద్రవ్యచింతానిమగ్నులు. ఉదాహరణముగా కృషీవలుని యింటగాని, కార్ఖానాయందుగాని, గనిలోగాని కాలిడి యుండబోరు. కనుకనే అన్నవస్త్రముల గురించిగాని, యిల్లువాకిలి గురించిగాని అతడు తలంచబోడు. యేదేశము దిగుమతులకన్న అధికముగా ఎగుమతులు జేయునో అదియే ఆతనికి దైవము వంటిది. అధికముగాజేసిన ఎగుమతులకు ఋణపత్రములకన్న యితరముల గాంచబోరు. అమెరికాదేశీయులగు మీరు అట్టి పత్రములనే విశేషముగా బొందియున్నారు. కోశాధిపతులు తనదేశమునందు ద్రవ్యమును ప్రోగుచేయుటయందే చాతుర్యమును కలిగియుందురు. అందులకే విదేశములకు మొట్టమొదట ఋణములొసగెదరు. ఈకారణముననే ఎగుమతి యధికమగుచున్నది. ఎగుమతుల నభివృద్ధిజేయుటకే వీరు ప్రయత్నముల జేసినను, చివరకు ఎగుమతిని నిర్మూలించుటకే యీప్రయత్నములు సాయపడుచున్నవి. విదేశఋణముల వడ్డీలకై ఆదేశపుసరకుల దీయుటతప్పని సరియైయున్నది. కట్టకడపట ఎగుమతిలేకయే దిగుమతులు జేసికొనునంతటి పరిస్థితులేర్పడును.

కోశాధ్యక్షులీ తంత్రమువలన వారివలలో వారుజిక్కుటయేగాక మిమ్ములగూడ నిరికింతురు. వారు ఎగుమతులు, ఎగుమతులు అని చిందులుద్రొక్కెదరు. అందులకై విదేశములకు అప్పులొసగెదరు. కాని దిగుమతులు యధికదిగుమతులే సంభవించుచుండెడిది. వారు నిపుణులని మీయభిప్రాయము. కాని వారు జూదమాడెడి వారుగాక యితరులు గానేరరు. వారి కుడిచేయి జేయుకార్యమునకు వామహస్తము భంగమును గల్గించుచునేయుండును.

పి. విశ్వనాథం.

# వైస్రాయి నన్ను పిలిపించాడుగా!

## శ్రీ లంబోదర పండిత రాయలు




నేను అప్పుడే భోజనంచేసి కూచున్నా మహాకష్టంతో వెనుకనున్న బాలీసు అప్పడ మయిపోయింది. నేను అలాకూచున్నా తొలినాటి మాఅమ్మాయి వెమలపాకులు పళ్లెం తెచ్చి యెదటపెట్టింది తాంబూలం సేవించిన తరువాత ప్రక్కనే పత్రికవుంటే పుటలు తిరుగ వేశా గాంధి మహాత్ముడు సమాధానావకాశాలగురించి మాటా డడానికి అవకాశం యివ్వమని అడుగగా విలింగ్డన్ వైస్రాయి నిరాకరించాడు అటువంటి దేమీ యీ పరిస్థితులలో పనికిరాద న్నాడు అవాస్తవచనిపి అంటూ నోరుతెరుచుకొని ఆలోచనలో పడిపోయా నాయనా యింకేది దారి అనేదే నా హృదయాన్ని వేధించుకు తినడము మొదలు పెట్టింది నాకు యింకయేమీ కనబడ లేదు ఒకటే చింత వొకటే ఆలోచన

* * *

గుమ్మం బయటనుండి "బాబూ అని యెవరిదో పలుపు యీయింటికి వచ్చేవాళ్లు మహా చాలా తక్కు వవుంది అందులో యీ వేళలో వచ్చేవాళ్లు లేనే లేరు ఎవరు వచ్చారో అని ఆలోచిస్తూ వుండగా మళ్లీ "బాబూ బాబూ" అన్న పలుపు ఎవరువారు లో నికి రావచ్చు అన్నా అలానేకూచుని లోపలికి వొక పెద్ద పొడుగాటి మనిషి వచ్చాడు బుగ్గలకు బుర్రమీసాలు, నెత్తిన పట్టుతలపాగ, మోకాలునుదాటి పోనా వద్దా అని సంకోచిస్తూవున్న పొడుగాటి ఎఱ్ఱని షేర్వాణీ, అటుమీద దవాలు ధరించిన వొక పెద్ద బంట్రోతు తయారయాడు ఈ అవతారమేమా యేం కొంప మునిగిందా అనుకొంటూ బాలీసుకు జేరబడిన వాణ్ణి కొంచంముందుకు వంగి, ఎవరువారు? ఎక్కడనుంచి అని అడిగాను

"ఢిల్లీనుండి బాబూ!"

ఢిల్లీ అనేసరికల్లా గొంతులో అదొక ఉద్రేకం ఆ ఉద్రేకపు టుండ అక్కుపడింది కళ్లుపైకెత్తిచూచా ఢిల్లీ! ఢిల్లీ, ఇంద్రప్రస్థ నగరం పవిత్రనగరం, ప్రాశస్త్యనగరం, పురాణనగరం చరిత్రాత్మకమైన నగరం ఢిల్లీ! ఢిల్లీనుంచి యెందుకు వచ్చాడీ బంట్రోతు?

"బడాసాహెబు, ప్రభువువారి హుకుమ్ అయిం దండి తమర్ని దర్శనానికి రమన్నారండి" అన్నాడు ఆ డఫేదారు

'నన్నా ఓ ప్రభువువారా? రమన్నారా? ఏ ప్రభువువారు?' అని యింకా కొంచె లేచి కూచుని అడిగా

"చిత్తం, ప్రభువువారి ఆజ్ఞ అయిందండి, వైస్రాయిగారు తమర్ని తీసుకు రమ్మన్నారు వైస్రాయి-చక్రవర్తి తరఫున రాజ్యం యేలుతున్న వైస్రాయి-నన్ను రమ్మన్నారా?— నాకంతా అగమ్యగోచరంగా కనబడింది కాని లోపల ఆందోళనగావుంది. ఇలాగునే యెక్కడో కొందరు కుట్రకుంకలు కుట్ర పన్నుతున్నారనే కారణం చేత మాహారుగాయన కొడుకుని సర్కిల్ ఇన్స్పెక్టర్ గారి హుకుమ్ అయిందని పలుచుకుపోయారు అటువంటిదే కొంప ముంచే దేమన్నా వచ్చిందా యేమి? హింస అంటే అసలు నాకేమీ పడదు అటువంటప్పుడు హుడలు యెత్తడంలో ఆశ్చర్యం లేదు

బంట్రోతుని కొంచం మంచి చేసుకుంటే మంచి దనుకొని "కుచో, చాలా దూరం నుంచి వచ్చావు, కొంచం మజ్జిగ దాహానికి యివ్వనా? ఫలహారం చేస్తావా?" అని కూచోబెట్టి 'ఐతే మనలో మన

మాట, వైస్రాయిల వారు యిప్పుడు నన్ను పిలిపించడ మెందుకో' అని అడిగా.

"అదేమో తెలియదండి, మిమ్మల్ని తక్షణం తీసుకురమ్మని మాత్రం హుకుం అయిందండి'

'సరే యెప్పుడు రావాలి?'

"మిమ్మల్ని తక్షణం, యెలావుంటే అలా తీసుకుని రమ్మని ప్రభుపు వారి ఆర్డరు. మనం బయల్దేరదాం."

'తప్పదన్నమాట? ఐనా యెందుకంటావ్ నన్ను పిలవడం? గాంధీగారితో మాటాడ నన్నాయన నాతో శేమన్నా ఆ విషయమై మాటాడాలని వుందా వారికి? ఇంత అర్జంటుగా రమ్మన్నారే!' అని మహా పరిచయమున్న వానికి మల్లే అడిగా.

"దఫేదారులతో ఆ విషయాలన్నీ చెపుతారా మహాప్రభువులు? యింక మనకు ఆలస్యమవుతూ వుంది యింక దయచెయ్యండి వెళదాం" అన్నాడు దఫేదారు.

గుడ్డా గుడిసి చక్కబెట్టుకోని వస్తా మరి, యింక తప్పదంటూ లేవబోతూవుంటే "అయ్యా, వైస్రాయి వారిని చూడబోతూవుంటే మీకు అవన్నీ కొదువా? దయచెయ్యండి, మిమ్మల్ని ఉన్నవార్ని ఉన్నటుగానే ఒక్క క్షణం ఆలస్యం కూడా లేకుండా తీసుకురమ్మని ఆజ్ఞ. ఇలానే తమరు బయల్దేరి రండి. ఇంక నేను ముందు వెళ్తా స్టేషనుకు, శెలవు" అన్నాడు. అతను వెళ్లాడు.

ఏమేవ్, చూడూ వైస్రాయిని చూడడానికి ఢిల్లీ వెళ్తున్నా—వస్తా,తలుపు వేసుకో ఆనిమా యింటి ఆవిడతో చెప్పి, గుమ్మం యెదుటనే వున్న రిక్షాబండిలో యీ కళేబరాన్ని పడవేసి 'స్టేషనుకు' అన్నా.

స్టేషను చేరే సరికే గంటగొట్టింది. కూత వినబడింది. యింక టిక్కెట్టు కొనాలి. దఫేదారు కనబడడు. టిక్కెట్టు కొందామన్నా మూడవతరగతి కొనడమా? వైస్రాయిని చూడబోతూ మూడవ తరగతి యేమిటి? అదీగాక యీ ఆలోచనలకు వీల్లేదు. రైలు కూత వినబడింది. గునగున పరిగెత్తుకుంటూ కదలడానికి సిద్ధంగా వున్న బండిదగ్గరకువెళ్లి రెండో తరగతి పెట్టెలో యెక్కా. బండి కదిలిపోయింది.

ఆ రెండో తరగతి పెట్టె యిద్దరికోసం. పై 'బెర్తు'లో యెవరో తెల్లదొర అదేమి ఆశ్చర్యమో అప్పటికప్పుడే నిద్రపోతూవున్నాడు. క్రిందనున్న మెత్తల బల్లమీద నేను కూచున్నా. బండి కదుల్తూవుంటే టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్నామే? యెవరన్నా నీ టిక్కెట్టు యేదీ అని అడిగితే యేం చెయ్యడం—ఆ, అదేమిటి? వైస్రాయిని చూడబోతున్నానని చెపుతా, అని సమాధానపడ్డాను. పరుగు పరుగున రావడమేమో, శరీరం మహా అలసిపోయింది. మెత్తని పరుపుమీద దేహాన్ని వాల్చి వైస్రాయిని చూచేటప్పుడు ముందు యేంచెయ్యడం? యే భాషలో మాటాడడం, ఎలా సమాధానాలు యివ్వడం మొదలైన సంగతులు ఆలోచిస్తూ నిద్రపోయా.

ఇంతలో యేదో మృగం గాండ్రించి నట్లయింది. ఉలికిపడి లేచా. పైన నిద్రబోతూ వున్న తెల్లాయన లేచి నిలబడ్డాడు. అతని కళ్లు యెర్రగా వున్నాయి. చేతనున్న కాళీ బ్రాందీకాయ కిటికీలో నుంచి విసరివేశాడు. ముఖం కందగడ్డలా యెర్రవారిపోయి ధుమధుమలాడుతూ వుంది, ఇది యూరపియనులు యెక్కే పెట్టె అన్నాడు. నీవు కూచోరాదు అన్నాడు. నాకూ సమానాధికారం ఉందంటూ వైస్రాయి ఆహ్వానం మీద వెళ్తున్న నాకు యితనితో లెఖ్ఖ యేమిటని అంటూ మాటాడుకు పడుకున్నా.

రైలు ఒక స్టేషనులో ఆగింది, నాకూ మెలకువ వచ్చింది. ధాం ధూమ్ చేస్తూ ఆ తెల్లాయన కిటికీ నుంచి తల బయటకు బెట్టి టికెట్ కలెక్టరును పిలిచాడు. నేను కళ్లుమూసుకుని నిద్రపోతూ వున్నా. టికెట్ కలెక్టరు వచ్చి నన్ను సవినయంగా లేపి, "మీరు యింకొక కంపార్టుమెంటులో యెక్కండి. యిది దొరలది" అన్నాడు. అలా అనడం అన్యాయం, రైల్లో అందరికీ సమానాధికారమె, నేను యిక్కడే ఉంటా అన్నా. ఇంతకన్నా విశాలమైన కంపార్టుమెంటులో యెక్కుదురు గాని అన్నాడు.

వైస్రాయిని చూడబోతూవున్న నన్ను యింత అవమర్యాద పరచడమా అన్నా.

దానితో 'మీ టికెట్ చూపండి' అన్నాడు టికెట్టు కలెక్టరు.

రాజబంధువుకు టికెట్ ఏమిటన్నా. రైలు ఉద్యోగి పకపక నవ్వి నన్ను యింక జబర్దస్తీగా బయటకు రమ్మనడము మొదలు బెట్టాడు. తెల్లాయన నోటికి వచ్చినదల్లా యింగ్లీషులో తిట్టడానికి లంకించుకొన్నాడు. నన్ను యెలా అయితేనేం, రైలు కదలే

లోపున దించి యింకో పెట్టెలో యెక్కించి గార్డుకు వొప్పగించాడు.

ఢిల్లీ,స్టేషన్‌లో దిగా. ప్లాట్ ఫారం ఉన్నత శిఖరాలు, గోపురములు, కనబడ్డాయి. డవాలీ డఫేదార్ ప్రత్యక్షం. ఆ గోపురాలు చూచాక ఊరు చూడాలని వుందని అన్నా. ముందు వైస్రాయి గారిని దర్శించండి, ఆ తరవాత చూదాం పూరు అన్నాడు. సరె, టాంగా యెక్కాం. రెండు మూడు పెద్ద భవంతుల వద్ద తిప్పాడు. తరవాత ధర్మశాల అనబడే సత్రంలో బసచేసి స్నానానంతరం వైస్రాయి భవంతు ద్వారం వద్దకు రమ్మన్నాడు.

నేను వెళ్లా. గుమ్మం వద్ద నిలబడ్డా. ఒకటి, రెండు, మూడుగంటలు గడచాయి. ఆ బొత్రమీసాల డఫేదారు కనబడలేదు. కాళ్లు పీకులెత్తిపోతున్నాయి. నన్ను యెందరో దారిపోయే వాళ్లు చూస్తు వున్నారు. ఇంతలో గుర్రమెక్కిన సార్జంటు పేము బెత్తంతో వచ్చాడు. ఏం, యిక్కడ యేం చేస్తున్నావన్నాడు౹

...   ...


నా కణతమీద పళ్లున బండ విరిగి పడినట్లైంది. బాధ! అపరిమితమైన బాధ. చెయిబెట్టి తడిమి చూచా. కణతమీద బొప్పి కట్టింది. ప్రక్కమర చెంబు బోర్ల బడింది. చాప తడిసిపోయింది. ప్రక్కనున్న తమలపాకుల పళ్లెం తల్లక్రిందులైంది. "ఏం, తాతయ్యా, నిద్రలో బోర్లబడ్డావా౹ నీళ్లన్నీ పోయియే" అన్నాడు. మామనుమడు నవ్వాడు.

...   ...

ఇదంతా నిద్రలో వచ్చిన కల అని అప్పుడు తేలింది. లేకపోతె నేనేమిటి వైస్రాయియొక్క ఆహ్వానం అందడ మేమిటి! కాని కలలలో వొక్కొక్కమారు ముందు జరిగేది తెలుస్తుంది. అలా నేను ఉలికిపడి పొర్లి మరచెంబు దెబ్బ తినకపోతే ఆ తరవాత వైస్రాయితో కలలోయెటువంటి సంభాషణ జరిగేదో యెటువంటివిషయాలుబయటపడేవో గదా! ఎటువంటి పర్యవసానం తేలేదో కదా! ఇంతకూ, యిది అంతా కలలోని విషయం సుమండీ, కొంప తిసి మీరు దాన్ని యదార్థం అని నమ్మించడానికి చెప్పానని మాత్రం అనుకోకండి.

## పవిత్ర యాత్రికులా? పేకాటయాత్రికులా?

శాస్త్రి, చౌదరి, గుప్త, అవధాని నలువురూ మతమంటె చెవి చేసుకునేవారని కొందరు అనుకొంటారు నలువురు యాత్రాస్థానాలను దర్శించడానికి బయల్దేరారు. ఒక పనిమనిషితో.




మొదట రైలుబండిలో ఒక చిన్నపెట్టెలో యెక్కారు గుప్త పెట్టెలోనుండి పేక తీశాడు. నలువురూ చక్కగా పేకాట ఆడుతూ ప్రయాణాం చేశారు.




నటరాజదర్శనార్థం చిదంబరం వెళ్లారు. పేకాట మహా జోరుగా వుంది. ప్రళయతాండవము చేసే ఆ దివ్యమూర్తి నటరాజు సమక్షాన్ని పేకాట ఆడారు. సేవకుడు పూజా విధానాన్ని పూర్తిచేయించి ప్రసాదములు మూటకట్టాడు.



చిదంబరమునుండి భక్తులు శ్రీరంగం వెళ్లారు. ఇక్కడ నే శ్రీరంగనాథుడు నిద్రాముద్రలో నుంటాడు. రంగనాథుని దేవళావరణలో రన్మోరు ఆడారు. సేవకుడు కావేరిలో స్నానంచేసి పూజావిధులు పూర్తిచేయించి పులిహారపొట్లంతో బయటకు వచ్చాడు.



ఇంతదూరమువచ్చి మధుర మీనాక్షిని చూడకుండా వెళ్లడమా? యాత్రికులు మధురకు వెళ్లారు. సృష్టికి మూలమైన మీనాక్షి ఆలయమునకు వెళ్లి ముక్కలు పంచుకొని ఆటకు దిగారు సేవకుడు తనపని తాను చేశాడు.



మధుర మీనాక్షి అయాక ధనుష్కోడి మాటయేమి! ధనుష్కోడి చాలా ముఖ్యం భక్తులు ధనుష్కోడికివెళ్ళి పవిత్రతీరమున కండువాపరిచి పేకాటాడారు. సేవకుడు సముద్రంలో స్నానముచేసి అర్చన సాగించివచ్చాడు.

ఇంక ప్రతిరోజూ మధ్యాహ్న సమయానికి కాశీ రామేశ్వరముల నుండి వచ్చి వ్రాలి ఆహారము ఆరగించి పోయే పక్షితీర్థము చూడకుండానా అంటూ యాత్రికులు అక్కడకు వెళ్ళి పక్షులు ఆహారం తింటూవుంటే అదే కొండమీద ఆ పక్షుల సమక్షమున పేకాడారు.





ఇంతా అయిన తరవాత ఏడు కొండలవాణ్ణి చూడకుండా యెలా ఉండడం? సరే అంతా తిరుపతికెళ్లారు. ఏడవకొండ కెక్కి శ్రీ వెంకటేశ్వరులవారి సన్నిధిని సేవకుడు హారతి మొదలైన మ్రొక్కులు చెల్లిస్తూవుంటే భక్తులు పేకాడారు.




యాత్రలు పూర్తిచేసుకుని భక్తులు ఇంటికి వచ్చారు అనేక క్షేత్రాలకువెళ్లి దినమునకు పది పన్రెండుమారుల వంతు మునుగుతూ జ్వరమని ఒక్కమారుకూడా చీదకుండా భర్తలు తిరిగి వచ్చినందుకు వాళ్లభార్యలు దేవుళ్ళకు కృతజ్ఞతా పూర్వకవందనములు అర్పించారు ఆనలువురు భక్తులున్ను ఆయాదేవుళ్ళమహిమలు వర్ణిస్తూ ప్రసాదాలు పేరుపేరున పంచిపెట్టారు.

# ప్రఖ్యాతివడసిన మామందులజాపితా



### ఉదరక్రిమి సంహారబిళ్ళలు

ఈ బిళ్ళలో ఒక సంవత్సరపు శిశువులకు అర్ధబిళ్ళయును, ఇతరులకు ఒకటి లేక రెండుబిళ్ళలు చొప్పునను యిచ్చినరోగుల కడుపులోనుండుచిరు పురుగులును ఏలికపాములును సునాయాసముగా బయలుపడును.

8 బిళ్ళలు 0 6 0

### కుండలాది తైలము

చెవిలో చీముకారుట, చెవిలోఘోష, చెవిపోట్లు, పైత్యం యివి తీరును డైరక్షను నోటీసులో చెప్పినట్లు రెండుపూటలును రెండు మూడు బొట్లవంతున చెవిలోవిడిచి 2 దినముల పిదప వంచి వేయవలయును.

ఒక డోసు సీసా 1-కి 0 4 0

## నేత్రరోగనివారిణి

తైలము ప్రతిదినము వుదయం కన్నులకు వుపయోగించిన యెడల కన్నునొప్పి, పోట్లు, మూతపడుట, నీరు కమ్ముట, మబ్బుగా నుండుట, కన్నుమంటలు కంటివాపులు మొదలయిన వ్యాధులను హరించును. ఈతైలము వుపయోగించుతూ వచ్చినను నేత్రములకు చెడుపు లేక సులోచనము లేకనే ఉండవచ్చును.

డబ్బి 1-కి 0 8 0

## సర్వమేహ నివారని ద్రావకము

ప్రసిద్ధిచెందిన ద్రావకము, వుదయము సాయంత్రము రెండుపూటలు చొప్పున 10 దినములు పుచ్చుకొనిన బహుదినములుగా దేహములో యిమిడియుండు మేహరోగములు, మేహవాయువు, ధనుర్ వాతము, కాళ్లుపట్లు మేహము వల్ల కలుగు రణములు, పగుళ్లు, గ్రంధి మొదలగు వ్యాధులను కుదుర్చును. కఠినపత్యములేదు. పాలు పెరుగు మొదలగునవి యన్నియు భుజించవచ్చును, విరేచనము, బలహీనము, ఆయాసము మొదలైనవి కలిగించక సుఖముగా వ్యాధిని ఖండించును.

ధర సీసా 1-కి 1 8 0

## జన్మనిగ్రహము

### పురుషులకు

ఇదియొక అద్భుతమైన గొట్టము. పురుషులు సంభోగకాలమందుపయోగించుటకై ప్రత్యేకముగా తయారుచేయబడినది. స్త్రీలకుండు అంటువ్యాధులను పొందకుండ అడ్డగించుటకు యీ సాధనముకంటే వేరేదియు ఉపాయములేదు. దీనిని అందరునుపయోగించవచ్చును. దీనివలన కీడేమియు గలుగదు.

ధర 1-కి 1 0 0

### స్త్రీలు ఉపయోగింపదగిన సాధనము

శాస్త్ర పరిశీలన మొనర్చి గర్భనిరోధమునకిదియే యని తెలుసుకొనబడిన సాధనమిదియొకటియే. మేలైన రబ్బరుతో తయారు చేయబడినది. పట్టువారముతో కూడ పంపబడును. పై చెప్పిన సాధనము లెట్లు వాడవలయునో అవిధానమును తెలుపునట్టి కాగితమును కూడ పంపెదము. పాశ్చాత్యులీగొట్టమునే ఉపయోగించుచున్నారు.

ధర 1-కి 2 8 0

ఆర్యా బుక్ డిపో, తిరువల్లిక్కేణి మదరాసు.

ఆరోగ్యశాపత్రములు పొందిన

# శకుంతలా పరిమళ తైలము

ఈ తైలములోగల రమణీయమగు పరిమళము గలదు తలకు చరిమి దువ్వుకొనిన హృదయమునకు హాయికలుగును, వెంట్రుకలను చక్కగ పెరుగనిచ్చును, మెదడునకు చలవకలుగనిచ్చును. కండ్లకు చల్లదనమునిచ్చును కంటియందు నీరుకారడం, తలలోనుండు కురుపులు, వెంట్రుకలు పగులుట, మయకం, తలత్రిప్పుట, వీటిని నివారించగలదు. మనోల్లాసం, జ్ఞాపకశక్తి కలుగజేయును కొందరు మిత్రుల ప్రోత్సాహపరచినందున ఈ చమురు తయారుచేయించితిమి ఒకసీసాకొని పరీక్షించిచూచిన మీకు నిజము తెలియును



5 తులములు సీసా 1-కి 0 12 0



# వెంట్రుకలు పెరుగు

# సువాసన చుక్కలు

ఇవి మంచినూనెయందుగాని కొంకాయనూనె యందుగాని కలిపి ప్రతిదినము కురులకు వ్రాయుచుండిన కురులు మర్రి యూడలవలె పెరుగును వెంట్రుకలకు పట్టెడు పేను, చుండ్రు మున్నగునవి అన్నియు దూరమగును కురుపులు రాక మెదడునకు బలముకలిగించును

బుడ్డి 1-కి 12 అణాలు.

# నీలగిరి యూక్లిప్స్ ఆయిల్

ఇది వాంతిబేది, ప్లేగువ్యాధి, తేలు మొదలైన విషజంతువులకాటు, కత్తి వగైరాలతో నరుకుగాయములు, నరములు, నులుకు, వేడినీళ్లుతగిలి కొదిరిన బొబ్బలు, చితికిన బొబ్బలు, ఇంఫ్లూయంజా, మలేరియా, సకలవిధ జ్వరములు, దగ్గు, కఫ్ఫ వాయి ఎగ్గు, వాయువు, పల్లుపోట్లు, పండ్లనొప్పి, తలనొప్పి, ఒంటి తలనొప్పి, కన్నుమంటలు మొదలయిన వ్యాధులను ఖండించ దగిన ఈ దివ్యౌషధమును ఒకరుకొని ఉపయోగించిన మరొకరున్ను మిత్రుల పలుమారు అడుగుదురు

ఒకఅవున్సు బుడ్డి 1-కి 0-4-0, డజను 1-కి 2-8-0.

## రోమసంహారి చూర్ణము

ఈచూర్ణము కొంచెం నీటిలో కలిపి రంగరించి రోమములుండు చోటికి పట్టించి 5 నిమిషములుంచి దళసరి కాగితముక్కతోగాని, కొట్టియాకుతోగాని ఊడ్చివేసినచో మందు పట్టించిన స్థలమున రోమం సులభముగా నూడిపోవును మంటలు, మాడిపోవుట మున్నగునవి యుండవు.

బుడ్డి 1-కి 0-8-0

ఆరియన్ బుక్ డిపో, తిరువళ్లికేణీ, మదరాసు.



# అయఃకాంత ద్రావకము

ధాతువృద్ధికి సేవింపదగిన లోహము ఇనుము. ఇనుముతిన్న వారికి నీరసము ముదుసలితనము లేదని అగస్త్యాదులు వచించియున్నారు. దీనిని సేవించుటచే భీమబలము సిద్ధియగును

## ద్రావకసేవనమువలన గలుగు గుణములు

ఉష్ణముచే వెంట్రుకలు రాలుట ఆగును, కాలుచేతులు, కండ్ల మంటలు పోవును, ముఖమునకు తేజస్సు నిచ్చును, వాతమును ఉష్ణమును పోగొట్టును, కాళ్ళు చేతుల దుర్బలము నణచి నొప్పులను పోగొట్టును, ఆకలిని జీర్ణశక్తిని కలిగించును, సడలిన నరములు బలిష్ఠముగ జేయును, గుల్మము, గుండెనొప్పి కలవారు 8-రోజులు సేవించిన జాలును ధాతుపుష్టిలేనివారు 40 రోజులు దీనిని సేవించిన జాలును.

(అర్ధమండలం)20 రోజులకువచ్చు మందు 1-0-0 (ఒకమండలం)40 రోజులకువచ్చుమందు 1-12-0

# కృష్ణసంజీవి




ఈ ఔషధము వల్ల కుదురునట్టి వ్యాధులు. తలనొప్పులు, పార్శ్వనొప్పులు, బెణుకు, చిడుములు, గాయములు, వాపులు, దగ్గు, తేలుకాటు వీటి నన్నిటిని కుదుర్చుటకు ఇది దివ్యౌషధము ఈ మందును నొప్పికలిగియుండుచోట 2 లేక 3 నిముషములు బాగా మర్దనా చేసినచో నొప్పులన్నియు మాయమగును. పసి పిల్లలకు కలుగు శైత్య నొప్పులకు సహా దీనివాడవచ్చును ఇది ఒక్కొక్క కుటుంబములోను, ప్రతి ప్రయాణీకుని చేతిలోను యుండితీరవలయును

దీని ధర బుడ్డి 1-కి 0-8-0, 12 బుడ్లు 5-0-0.

# "జీ క్యూర్" అను మేహ తెలుపును

మూడు దినములలో నయముచేయును.

అత్యుష్ణముచేత వచ్చు మేహరోగములు, సవాయిపుండ్లు, ఒరిశె గడ్డలు, తెల్లుపు, పసుపు, పచ్చ మున్నగు నానా విధ రోగములు గల్గుచున్నవి వాటిలో ముఖ్యముగా ప్రమేహము మూత్రకృచ్ఛ్రము, మూత్రనాళమందు మంటలు, తెలుపు వ్యాధి, బట్టంటు మున్నగు క్రూరమగు వ్యాధులకు యిది మిక్కిలి అనుకూలమైనది బుడి 1-కి 1 0 0



## హేర్ డై అను వెంట్రుకలు నలుపుజేయు తైలము

ఈతైలము నెరసిన వెంట్రుకలకుపూసిన 5-నిమిషములలో గా నల్లని వెంట్రుకలవలె జేయును మిగుల కాంతియునిచ్చును ఇతరమందులవలె వికారస్వరూపములు వీటియందుండవు. వెంట్రుకలరంగుతో యౌవనరూపము కలుగుట తటస్థించును సీసా 1-కి ధర 1-0-0

కరుణానిధి డిపో, నెం. 6, వెంకటేశ మేస్త్రీ వీధి, మదరాసు.

# తేలు మందు

(రిజిష్టర్ ట్రేడ్డుమార్కు)

**మందు పడినతోడనే విషము పారిపోవును!   ఏడ్పుతో వచ్చువారు నవ్వుతూ పోవలయును!!**

ఈమందువల్ల గుణములేదని ఋజువుచేయువారికి 100 రూపాయలు బహుమతి.



మనదేశములో ఈమందు ప్రతియింటిలోను ముఖ్యముగా ఉండితీరవలయును. ఇది ఆంగ్ల, యునాని, ద్రవిడ, ఆంధ్రవయిద్య నిపుణులవలన మెప్పుదల పొంది యున్నది. యెన్నిదినములు నిలువయుంచినను ఈమందుయొక్క గుణము మారదు తేలు, మండ్రగప్ప, జెఱ్ఱి, పాము, ఎలుక, ఇంకను యితర విషజంతువుల విషములను రెండు నిముషములలోపరిశుద్ధముగా నివారణ కలుగజేయును,


ప్యాకెట్టు 1-కి 0-8-0.   తపాలా ఖర్చు 0-4-0

ఒకేసారి 3 ప్యాకెట్లు కొనువారికి   తపాలాఖర్చుతో సహా 1-8-0.

,, 12 ప్యాకెట్లు కొనువారికి   తపాలఖర్చుతో సహా 5-0-0.

వర్తకులకు 100-కి 25 చొప్పున కమీషను యివ్వబడును,

# దేవదారు తైలము



ఈ దేవదారు తైలము వారమునకు రెండు మారులు శిరమున రాసికొని తలఅంటుస్నానము చేసిన కన్ను మంటలు, కంటిలో నీరు కారుట, చెవిలోపోట్లు,తలభారం, మెదడు ఉష్ణము,ఒంటితలనొప్పి, సాలేస్వరం, పైత్యపాండు, పచ్చకామెర మాస్త్రీజ్వరము, నాలుక యెండిపోవుట, కాళ్లు చేతులు మంటలు, శరీరము తెలుపగుట మొదలగు మేహ రోగములను నివారించును. తలఅంటుస్నానము చేసిన దినమున శీతలమైన వస్తువులు భుజించకూడదు

ధర ఒక సేరు నూనె డబ్బి 1-కి రూ 1-12-0.

అర్ధ సేరు ,, ,, 1-0-0.

# క్షయహారి

ఈ మందు పుచ్చుకొనిన కఫము, దగ్గు, ఈడుపుదగ్గు, శ్వాసదగ్గు, క్షయదగ్గు దగ్గుటవలన కలుగు గొంతు మంట, గొంతు కరకర, నిద్రలేకపోవుట, శీతలమైన వస్తువులను భుజించుటవలన కలుగు దగ్గు మొదలగు దగ్గులను ఖండించి కఫమును బయటికి వచ్చునట్లు జేయును 4 దినములలోనే దీని గుణము తెలియగలదు.   ధర బుడ్డి 1-కి 1-0-0.

# ఓటో లీల సెంటు



ఈ సెంటు మిక్కిలి వాసనగలది, దీనిని మీ యొక్క చేతిరుమాలులో లేక చొక్కామీద వేయుంచికొనిన 2 రోజులయినను వాసన పోదు. ఇందులో ఆల్కహాలు, సారాయం మొదలగు నవేమియు కలుపలేదు ఈ సెంటు బహురమ్యమైన చిన్నపెట్టెలో చిన్న అద్దమునూదితోటి సొగసైన బుడ్డిలో ప్యాకుచేసియుండుట వల్ల క్రిందపడినను విరిగిపోవుటకున్ను వీలుపడదు. ట్రావిలింగు చేయునప్పుడు సదాజేబులోనే వుంచుకొనవచ్చును.   ఒక డ్రాం ధర 1-0 0. అర డ్రాం 0-10-0.

కరుణానిధి డిపో, నెం. 6, వెంకటేశ మేస్త్రీవీధి, మదరాసు.


# మన్మథస్తంభనమాత్రలు



ఈ స్తంభనమాత్రలలో ఒకటి సాయంకాలము ఆరుగంటలకు నోటవేసుకొని మ్రింగిన తర్వాత పాలు తాంబూలము వీటిని పుచ్చుకొనవలయును యింద్రియపటుత్వమునకు యిది ఒక్కటే పరమౌషధము 10 రోజులు సేవించిరేని పురుష సింహబలము, లభించును పలుచబడిన ఇంద్రియము గట్టిపడును

డబ్బి 1-కి 2 0 0

గమనింపుడు! స్త్రీలపాలిటి వరప్రసాదము!! కొని పరీక్షించుడు!!!



# పుత్రసంతాన సంజీవి తైలము

స్త్రీలయొక్క గర్భమున పురుగులుచేరి ఇంద్రియమును నాశముచేయుటచే గర్భకోశమునందు కండపెరిగి రక్తగడ్డకట్టును వాయువు, పైత్యముచేరినను స్త్రీలకు గర్భమునిలువదు. అట్టివారు యీ నూనెను ఉదయం సాయంకాలములందు 1 లేక 3 దమ్మిడీలు తూనిక చొప్పున 15రోజులు సేవించినతో గర్భకోశమున నుండు అనువిధములగు రోగములును నివర్తించును.

ధర 1-కి 2-0-0

# నారాయణ సంజీవితైలము




ఈ తైలమును వారమునకు రెండుస్నానములు పంతున 10 స్నానములుచేయువారికి తీరని పైత్యము, జీర్ణించిన వాతజ్వరములు, జన్ని, గొంతువ్యాధులు అస్థిజ్వరం, కండ్లుమంట, తీట, గజ్జి, పీనస, ఒంటితలనొప్పి మొదలగు అనేకవ్యాధులు నయమగును కండ్లకు మంచిప్రకాశము కలుగజేయును.

విద్యార్థులు విశేషీ మునసబులు, కరణములు, ఉపాధ్యాయులు మొదలగువారికి ముఖ్యము

ఫీవిధర 15 తులములుగల డబ్బి 1-కి 1 0 0

# కస్తూరిమాత్రలు



శరీరములో ఏయొక్క వ్యాధి కలుగకుండ యుండగోరువారు ప్రతిదినము భోజనానంతరము తాంబూలముతో గాని లేక ఉత్తనేగాని, ఈ మాత్రను సేవించుతూ వచ్చినట్లయితే, పండ్లనొప్పులు, అజీర్ణము, పైత్యవాయువు, జలదోషము, మొదలగు వ్యాధులు దూరమగును

పిల్లలనుండి పండు ముసలివాండ్రవరకును గలుగుకఫం, దగ్గు, మొదలగు వ్యాధులకు వయస్సుకు తగినట్లు2 మొదలు 4 మాత్రలు వరకు ఇచ్చిన గుణము కలుగును.

ధర బుడ్డి 1-కి 0 12 0

ధనలక్ష్మి కంపెని, సౌకార్‌పేట, మదరాసు.

# సతీపతికుతూహల రహస్యములు.

యీ గ్రంధమందు యిరువది మూడు విపులప్రకరణములున్నవి. ఈ పెద్దగ్రంథమందు యువతీ యువకులందలి జాతులు, లక్షణములు, ఆచారములు, వర్తనా విధానములు, వారు వారు వాంఛించు సౌఖ్యమార్గములు మున్నగు నవన్నియు చక్కగ పొందుపరుపబడియున్నవి. నాయికా నాయకులు వారివారి ప్రధానాశయములు, వివాహ విధానములు, శయ్యలు, వాటియందలి స్త్రీ పురుష వర్తనలు, యువతీయువకులకు ప్రేమ యెట్లు వెలయగలదు? అనుకూల వర్తనమును గలిగి దంపతులు సుఖించుటెట్లు బంధనలయొక్క యవసరము మున్నగువిషయములన్నియు యీ గ్రంధమునం పొందుపరుప బడియున్నవి. కనుక యీ సతీపతి కుతూహల రహస్యములను కొని చదువవలయును. ముద్దులొలుకు రీతి ముచ్చటగ ముద్రింపబడిన యీ పెద్దగ్రంథమును ప్రతి యువతీయువకుడు కొని తీరవలయును.

గ్రంధము వెల 1 కి రూ. 2. పోస్టుకర్చు అ. 7.

ఆనందబోధిని చందాదారులకు రు. 1-10-0 పోస్టుఖర్చు ప్రత్యేకము.

రెండు గ్రంథములు ఒకేమారు కొనినచో పోస్టుఖర్చులను మేమే భరింతుము.

ఆపదనుండి రక్షించునది!

అందరిని యాదరించునది!!

# మతివంచనదీపిక

250 పేజీలు 16 చిత్రములు

ధర్మదేవతయు, సత్యదేవతయు తలవిరబోసి మధుర నాట్యముచేసిన పుణ్యభూమియగు మన భరతఖండమున, కలిప్రవేశమునుండియు ప్రజలు ప్రకృతికి లోనై ధర్మచింతనుండి తప్పి యధర్మచింతకు వశులై యల్లలాడుచున్నారు మోసములు పెరిగిపోయినవి. మోసమయముగ నుండుటచే, నిర్వచకులగువారు ఇట్టిమోసముల జిక్కి పరితపించుచున్నారు, కావున నామోసములకు వశులు కాకుండుట కీగ్రంథములో 121 మోసములు మిక్కిలి సాధనభూతముగ నుండునటులవ్రాయుచు మోసకార్యము లెటుల జరుగుచున్నదనియు దానియాంతర్య రహస్యములు లీగ్రంథమున వివరముగ పొందుపరుప బడియున్నవి. ప్రతివారును ఈగ్రంథమును చదువవలయును.

వెల రు. **1-4-0.** ఆనందబోధిని చందాదారులకు రు. **1-0-0.**

పోస్టుఖర్చు ప్రత్యేకము.

"ఆనందబోధిని" ఆఫీస్ పోస్టు బాక్సు నెం. 167, మదరాసు.

అత్యద్భుతములు ! అపూర్వములు !! నీతిబోధకములు !!!

# కుటుంబవినోదకథలు

దీని వెల] [రూ. 1-8-0

ఈ పుస్తకమునందు 1. పత్నీధర్మము, 2. ధనము వచ్చినటులేపోవును, తల్లి చేసినమేలు, 4. పైకము పంక్తియందు, కులము వెంటయందు, 5. పాత్రమెఱింగి బిచ్చముపెట్టుము, 6. గోత్రమెఱింగి కన్యకనిమ్ము, 7. ప్రేమగల భార్యయుఁ దెలివిలేనిభర్తయు, 8. భర్తను సన్యసింపజేసిన భార్య, 9. భర్తనుజంపినభార్య, 10. భార్యనుజంపిన భర్త, 11. నవనాగరికత, బాలాంబచేసిన బహూపవాసము, 13. చిత్తమునుగిలంచినచిత్రాంగి లేక కండ్లగప్పెడికామము. అను 13 కథలున్నవి.

## మిత్రద్రోహము.

ఇదివఱకిట్టి నవల వెలువడలేదు. ఇది అపరాధాన్వేషకనవల తిన్నయింటికి వాసాలెంచు దుష్టునివలె నొకడు స్నేహితునిమూలమున బాగుపడి స్నేహితుడు చెల్లుబడిగలవాడుకాగా తనకాభాగ్యము లభింపకపోయెగదాయని వగచి తాను ఒకతెనుచంపి ఆనేరము నితనిపైమోపుట మొదలగునవి చాలయద్భుతముగను శోకరసపూరితముగా నుండును. తుదకు సిగరెట్టుమూలమున నిజము బయలుపడును.

గ్లేజు కాగితం ప్రతి 1-కి 0 8 0 తపాలఖర్చులు వేరు.

ఆనందబోధిని చందాదారులకు రు. 0-6-0 మాత్రమే.

## యశోదర.

రాణాంతఃపురమునకు వెనుకప్రక్కనునుండు తోటలో నొకముదుసలి యాడుదియు నొకపడుచునొక పొదరింటఁ గూర్చునియున్నారు. వారుండుచోటికే రాజప్రియయు వచ్చుచున్నది, ముదుసలిది నిజముగా నాడుదికాదు. అడవేషముఁ దాల్చినయొక మునలిబోయ్యఁడు; రాజునకు ప్రియుఁడు, అంతఃపురమునందు వారియొద్దనే రాజమర్మంబుల యిందు వివరింపబడినవి. కథ రసవంతము.

గ్లేజు కాగితం ప్రతి 1-కి 0 12 0

## జగదేకరంభ.

జగదేకరంభయన నిమరియే జగదేకరంభ. రంభయన దేహసౌందర్యముచే తెలుగంటివారిని మెప్పించునదియని యనుకొనకుడు. ఈ పతివ్రతామతల్లి కథను జదివిచూడుడు, సౌందర్య మొకటియేగాక కులవిద్యాతారుణ్య సౌజన్య శ్రీబలదాన శౌర్యకరుణా శోభితయై లోకుల నెటుల మెప్పించినది అందురు. గాధ చాల చమత్కారమయినది. గ్లేజు ప్రతి 1-కి 0 10 0 తపాలఖర్చులు వేరు.

## సోదరప్రేమ

ఇది దొరతనమువారి వలన పాఠశాలలకు అంగీకరింపబడి యున్నది.

ఈ పైపేరునుగల శ్రొత్తనవలవంటిదాని నుంకొన్నడును జదివియు వినియుండరు ఇందొకడు తనతమ్ముని యాత్మహత్యనుండి తప్పింప నానేరంబు నన్నరియే చేసినటుల నిందమోపుట మిగుల పరితాపకరంబుగను నాశ్చర్య జనకంబుగా నుండును తల్లియది సత్యమనినమ్మి పుత్రునిద్వేషించుట నధిక పరితాపము నిచ్చును. గ్లేజు కాగితం ప్రతి 1-కి 0 10 0 తపాలఖర్చులు వేరు.

"ఆనందబోధిని" ఆఫీస్ పోస్టు బాక్సు నెం. 167, మదరాసు.

నీయంత నీవే ఇంగ్లీషు నేర్చుకొన నిచ్చగలదా?

స్త్రీ పురుషులు నేడు స్వయముగ యింటియొద్ద చాల సులభముగ ఆంగ్లభాషను నేర్చుకొనుట కవకాశము కల్పింపబడినది. ఆంధ్రభాషాపరిచయముగలవారు నూతనమై విపులమైయున్న

# ఆనంద ఆంగ్ల భాషా బోధిని.




వెంటనే తెప్పించి చదువుకొనవలయును. ఈ యుత్తమగ్రంథము నిదివరలో వేలకొలది ఆంధ్రము తెలిసిన ఆంధ్రు లుపయోగించి ఇంగ్లీషు భాషను నేర్చుకొని యెక్కుడ లాభము సంపాదించుచున్నారు. ఈ గ్రంథమందు అక్షరములు, వాటిఉచ్చారణ, పదములు వాటిధ్వని, వాక్యములు, వాటి రూపము, వాక్యము నెట్లు సునాయాసముగ వ్రాయుట, ప్రయోగించుట మున్నగు విషయములన్నియు ఆంధ్రమునను, వాటిముందుఆంగ్లమునను వ్రాయబడి యున్నవి ఉపాధ్యాయుడు లేకుండ, ఆకారతపారకునకు లేకుండచేయగల దిదియొక్కటియె గ్రంథము.

ఈ ఉత్తమగ్రంథమందు ఆంగ్లకథలు 16 నిండు పేజీల చిత్రములును గలవు. 728 పేజీల యీగ్రంథము తెలుగు తెలిసిన ప్రతి ఆంధ్రుడును చదువవలయును.

పుస్తకము వెల 2 రూపాయిలు. పోస్టేజి 8 అణాలు.

ఆనందబోధిని చందాదారులకు రు. 1-10-0 పోస్టుఖర్చు వేరు

ఈ పుస్తకము ద్రావిడభాషలో కూడ నున్నది. వెల రు. 2.

# లీలా

రసవంతమగు నవలారాజము

"చిన్నయింటి వాసా లెంచుట" యను వార్యోక్తి యీకథలో వచ్చు అంకిరెడ్డి వృత్తాంతమును జక్కగా వివరింపఁ బడియున్నది. తనకు మేలు చేసినవారికిఁ గీడుచేయ దలంపుగొని యందులకై యీ యింటికి రెడ్డిపన్నినకుట్రలు చదువఁజదువ నింపై భయావహంబై యుండును. తనకు ముందు వెనకలు దెలియని లీలా మదనమంజరులకు యోగినచేసిన మహోపకారము అంకిరెడ్డి తల దన్నినట్టులుండును. "బెదరినవానికి లోకమంతయు పిశాచమయ" మన్నట్లు దైవప్రీతిగా సహాయము చేయవచ్చిన ధరణీరాజును Xడ్డిదొంగయని భావించి యవమానకర కార్యంబుల లీలా చేయుట కరుణాశోకరసంబుల కొస్పదంబు సకలసౌభాగ్యంబుల కాస్పదంబైన దైవవనంబుచూచుటకై లీలా ధరణిరాజులు, మదనమంజరీ మనమోహనులు అంకిరెడ్డి దర్పీకరుఁడు చేసినప్రయత్నములు చదువఁజదువ నానందప్రాయమై యుండును. బాలురకు మాతృపితృభక్తియు, స్త్రీలకు పతియందలి ప్రేమయు పురుషులకు రాజవిశ్వాసమును వర్ధిల్లును. గ్లేజు కాగితం ప్రతి 1-కి 1 0 0 తపాలఖర్చులు వేరు.

ఆనందబోధిని చందాదారులకు 0-12-0 మాత్రమే.

"ఆనందబోధిని" ఆఫీస్ పోస్టు బాక్సు నెం. 167, మదరాసు.

# రూపాయలబహుమతి

## సినిమానటీబృందము వరుసపోటీ

ఈ పోటీయంతటి తేలికపోటీ యింకొకటి యింతవరకును వచ్చియుండలేదు మీరు తరుచు సినిమాలకు వెళ్లి మెచ్చుకొనుచుండు ఫిలిములలో కథానాయిక పాత్రలను ధరించియున్న కొందరు యువతుల పేరు యీక్రింద నీయబడినవి. మీరు చేయవలసిన దేమన ఆనట్టువరాండ్ర యొక్క ప్రతిభ, నటనాకౌశలము. రూపురేఖలు వగైరా విషయములను గమనించి ఎవరికి మొదటిస్థాన మిచ్చుటయో, యెవరికి రెండవస్థాన మిచ్చుటయో నిర్ణయించి ఒకటి రెండు మూడు అనుచు వరుసగా వేయవలయును. అలా వరుస నిర్ణయముగావించి ఇందు వెంటగల కూపనుతో సహా 20-వ తేదీలోగా కార్యాలయము చేరునట్లు అణాబిళ్లతో పంపవలెను. పోటీచేయు వారియొక్క వ్రాతల ననుసరించి ఆయా స్త్రీలకు వచ్చెడు యెక్కుడు సంఖ్యల బట్టి నిర్ణయమగు వరుసను వ్రాయువారికి బహుమతులియ్యబడును. నట్టువరాండ్రపట్టీ:—

జెబున్నీసా. సులోచన. గోహరు. మాధురి.

జుబేదా. సుల్తానా. కమలాబాయి. కో౯సతి.

వీటిని వరుసగా వ్రాసిపంపి బహుమానములు బడయుడు.

ఆనందబోధిని సెప్టెంబరు మాసపు బహుమానపుపోటీ కూపన్ ౮

పూర్తిపేరు,.......................................

గ్రామము,.......................................

పోస్టాఫీసు.......................................

తేదీ ........ జిల్లా.......................................

Ananda Bodhini Reg. No. M. 2590

ఈ సంచికలో

# రూపాయల బహుమతి పోటీ

కలదు

## వివరములు సంచికలో చూడుడు.

ప్రతి వెల అణాన్నర మాత్రమే.

మీప్రతిని ముందుగ పొందుడు.

---


## శ్రీ ధర్మాంగద చరిత్ర.

వరకవి వరదరాజకృత యక్షగానము.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి మున్నుడితో.

ధర్మాంగదచరిత్ర మృదువగు యక్షగానరూపమున రసవంతముగ కదళీపాకములో పాడబడినది. పదములగుంభన. భావప్రకటనము, పద్యముల పోకడలకు యిదియెంతయు పేరు గాంచినది. ఈకావ్యము స్త్రీపురుషులకెంతయు ఆనందమును కూర్పగలదు. అందునను యీప్రాత్రప్రబంధము చక్కగ గ్లేజుకాగితముమీద ముద్దులుమూటగట్టులాగున ముద్రింపబడినది. ప్రతి వెల ఒక్కరూపాయి మాత్రము.

ఆనందబోధిని కార్యాలయము.

పోస్టు బాక్సు నెం. 167, మదరాసు.


PRINTED & PUBLISHED BY N. MUNISAWMI MUDALIAR,
AT THE "ANANDA BODHINI" POWER PRESS,
NO. 6, LAWYER CHINNATHAMBI MUDALI STREET, SOWCARPET, MADRAS.